## ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులలో వేగం పెంచాలి : కలెక్టర్



నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్

**హుస్నాబాద్ టౌన్, మే 2, (ప్రభాతవార్త) :** పట్టణంలో 250 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను శనివారం సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందేలా ఆసుపత్రి నిర్మాణం ఉండాలని ఆమె స్పష్టం చేశారు. అలాగే నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణీత గడువులోపు ఆసుపత్రి పనులు పూర్తిచేయాలని ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఆసుపత్రి పూర్తయిన తర్వాత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయని అధికారులు తెలిపారు.




మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త


## తూతూ మంత్రంగా సాగిన నియోజకవర్గ స్థాయి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సమావేశం

**సిద్దిపేట అర్బన్, మే 2, ప్రభాతవార్త :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల ప్రణాళికలో భాగంగా శనివారం సిద్దిపేట రెడ్డి సంక్షేమ భవన్‌లో నియోజకవర్గ స్థాయి ప్రగతి ప్రణాళిక సమావేశం నిర్వహించారు.సిద్దిపేట ఆర్డీఓ సదానందం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో కొన్ని శాఖల అధికారులు మాత్రం కేవలం వచ్చాము వెళ్ళాం అన్నట్లుగా తూతూ మంత్రంగా రెండు ముచ్చట్లు చెప్పి వెళ్లిపోయారు.సమావేశం జరిగినంత సేపు అధికారులు సమావేశంపై దృష్టిపెట్టకుండా ఫోన్లు మాట్లాడడమే పనిగా పెట్టుకున్నారు. మొత్తం మీద నియోజకవర్గస్థాయి ప్రగతి ప్రణాళిక సమావేశాన్ని తూతూ మంత్రంగా ముగించారని చెప్పక తప్పదు. కార్యక్రమంలో వివిశాఖలకు చెందిన ప్రగతిపై స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వివిధశాఖల అధికారులు శ్రీనివాస్, పద్మ, కౌసల్య, సుధాకర్‌రెడ్డి, రాజప్రభాకర్‌రెడ్డి,హరికిరణ్ తదితరుల పాల్గొన్నారు.



సిఎం రేవంత్‌రెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

## సిఎంను సత్కరించిన ఆర్టీసీ జెఏసి నేతలు

**సిద్దిపేట రూరల్, మే 2, ప్రభాతవార్త :** ఆర్టీసి కార్మికుల సమస్యలను పరిష్కరించినందుకు ఆర్టీసి జెఏసి రాష్ట్ర కన్వీనర్, నేషనల్ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.డి.మౌలానా హైదరాబాద్‌లోని సిఎం రేవంత్‌రెడ్డి స్వగృహంలో కలిసి కృతజ్ఞతలు తెలిపి శాలువాతో ఘనంగా సత్కరించారు. 2019 కెసిఆర్ ప్రభుత్వ హయాంలో పెట్టిన పోలీసు కేసులను ఎత్తివేస్తామని సిఎం హామీ ఇచ్చారని తెలిపారు. గత నెల 22, 23, 24 సమ్మె కాలంలో నమోదైన పోలీసు కేసులు ఎత్తివేడానికి సిఎం అంగీకరించారని తెలిపారు. మూడు రోజుల సమ్మె కాలంలో వేతనం ఇవ్వాలని సిఎం ఆదేశించారని తెలిపారు. జెఏసి నాయకుల విజ్ఞప్తి మేరకు ఆర్టీసి కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయడంలో మీ సలహాలు, సూచనలు తెలియజేయాలని విలీనంతో కార్మికులకు నష్టం కలగకుండా విలీనం చేయడానికి ప్రభుత్వం సిద్దంగా ఉందని తెలియజేసినట్లు చెప్పారు. ఆర్టీసి కార్మికుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించిన సిఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రభుత్వ పథకాల అమలుకు కృషి చేయాలి

### జెడ్పీ సిఇవో జానకిరెడ్డి



మాట్లాడుతున్న జానకిరెడ్డి

**జహీరాబాద్, మే 2 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 90 రోజుల కార్యక్రమం సందర్భంగా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు అధికారులు కృషిచేసి ప్రజల వద్దకు చేరవేయాలని జిల్లా పరిషత్ సీఈవో జానకిరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని షట్కర్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన నియోజకవర్గం స్థాయి ప్రభుత్వ అధికారుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈసందర్భంగా జెడ్పి సీఈవో మాట్లాడుతూ 90 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సందర్భంగా గ్రామాల్లో ప్రభుత్వ పథకాలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా శరవేగంగా అమలు చేసి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ అధికారులు తమ తమ శాఖలకు సంబంధించిన పనులను పూర్తి చేయాలన్నారు. వేసవి కాలం దృష్ట్యా గ్రామాల్లో విద్యుత్ సమస్య మంచినీటి, పారిశుధ్యం వంటి వాటిపై దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వ అధికారులు సర్పంచులు ప్రజా ప్రతినిధుల సహకారంతో అభివృద్ధి పనులను పూర్తిచేయాలన్నారు. ఆత్మ కమిటీ చైర్మన్ పి.రామలింగారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సందర్భంగా అమలుచేస్తున్న పనులను వేగంగా పూర్తిచేసి ప్రభుత్వానికి ప్రజల్లో మంచి పేరు తీసుకురావడానికి అధికారులు కృషి చేయాలన్నారు. సమావేశంలో ఆర్డిఓ దేవుజ, మున్సిపల్ చైర్మన్ ఎండి యూనుస్, వైస్ చైర్మన్ కొత్త కాపు శిరీష సురేందర్ రెడ్డి, తహసిల్దార్ పి దశరథ్ ఎంపీడీవో మహేందర్ రెడ్డి సిడిపిఓ సుశీల సి డి సి చైర్మన్ మోబిన్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఖండిమ్ నర్సింలులతోపాటు నియోజకవర్గంలోని తాసిల్దారులు ఎంపీడీవోలు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## గుమ్మడిదల మున్సిపాలిటీలో బిఆర్ఎస్ ఆధిపత్యం

### కోఆప్షన్ సభ్యులుగా నలుగురు ఏకగ్రీవ ఎన్నిక



నియామక పత్రాన్ని స్వీకరిస్తున్న కోఆప్షన్ సభ్యులు

**గుమ్మడిదల, మే 2 ప్రభాతవార్త :** గుమ్మడిదల మున్సిపాలిటీలో కోఆప్షన్ సభ్యుల ఎంపిక ప్రక్రియ ప్రశాంతంగా సాగి, సద్ది విజయ భాస్కర్ రెడ్డి, మహమ్మద్ ఫయాజ్, లూజహన్, కాలమ్మలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ల సమగ్ర మద్దతుతో ఈ ఎన్నిక ఏకగ్రీవంగా జరగడం ప్రత్యేకతగా నిలిచింది. ఎన్నికైన నూతన కోఆప్షన్ సభ్యులు మున్సిపల్ కమిషనర్ దశరథ్ నియామక పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ చిన్న పాపని కుమార్‌గౌడ్ మాట్లాడుతూ, మున్సిపాలిటీ అభివృద్ధి కోసం అందరూ కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. వైస్ చైర్మన్ సంధ్యరెడ్డి నూతన సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు. నూతన సభ్యుల ఎన్నికతో మున్సిపాలిటీ అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

**కోహెడ, మే 2, ప్రభాతవార్త :** మండలపరిధిలోని బస్వాపూర్ గ్రామంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తేమశాతం వచ్చిన వడ్లకుప్పలు చాలా ఉన్నాయని కలెక్టర్ దృష్టికి తేగా తాలు తీసి గన్నీలలో నింపాలని సరిపడినన్ని లారీలను వచ్చేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. కేంద్రంలో అన్ని సౌకర్యాలు కల్పించాలని కొనుగోళులో జాప్యం కాకుండా సెంటర్‌లోనే ఉండాలని సిబ్బందిని ఆదేశించారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి

# అభివృద్ధిలో హుస్నాబాద్‌ను ముందంజలో ఉంచుతా

### రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్ రూరల్, మే 2, ప్రభాతవార్త**

పట్టణంలోని లక్ష్మీగార్డెన్స్‌లో శనివారం నియోజకవర్గ స్థాయి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమానికి రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆర్డీఓ రామ్మూర్తి ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అభివృద్ధి, సంక్షేమంలో ముందంజలో హుస్నాబాద్ ముందంజలో ఉంచుతానని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు సంవత్సరాల ఐదు నెలల కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో హుస్నాబాద్ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్య క్రమాలు అమలు చేశామని, రైతులకు రూ.250 కోట్ల రైతుభరోసా, మృతి చెందిన 679 మంది రైతుల కుటుంబాలకు రూ. 49.96 కోట్ల రైతు బీమా అందించామని చెప్పారు.3,515 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.150 కోట్లు మంజూరు చేయ గా, ఇప్పటివరకు రూ.74 కోట్లు విడుదల చేసా మని, 57,963 గృహాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 45 వేల మందికి పింఛన్లు అందుతున్నాయని, త్వరలో కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని వెల్లడించారు. రేషన్‌కార్డులు, ఉచిత బియ్యం పంపిణీ, కొత్తగా 13వేల రేషన్‌కార్డులు మంజూరు చేసి మొత్తం 61 వేల మందికి ప్రతి నెల 6 కిలోల సన్న బియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నామన్నారు.

**రోడ్లు, మౌలిక వసతుల అభివృద్ధి...**

కొత్తపల్లి టూ హుస్నాబాద్ నాలుగు లైన్ల రహదారి పనులు కొనసాగుతున్నాయని, హుస్నాబాద్-అక్కన్నపేట రహదారి నిర్మాణానికి టెండర్లు పిలిచామని, గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేయడం తన బాధ్యతగా తీసుకుంటానని హామీ ఇచ్చారు.తంగళ్లపల్లిలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణం జరుగుతుందని,శాతవాహన ఇంజనీరింగ్ కాలేజీ అభివృద్ధి, హాస్టల్ నిర్మాణాలు చేపడుతున్నామన్నారు.హుస్నాబాద్‌లో 250 పడకల ఆసుపత్రి అభివృద్ధితో పాటు మెడికల్ కాలేజీ ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటున్నామని, పర్యాటక అభివృద్ధి, మార్కెట్ ఏర్పాటు హుస్నాబాద్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేసే ప్రణాళికలో భాగంగా ఎల్లమ్మ చెరువు, అర్బన్ పార్క్ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, అలాగే హోల్సేల్ కూరగాయల మార్కెట్‌ను త్వరలో ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

**చెక్కుల పంపిణీ**

ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాలకు రూ.128 కోట్ల బ్యాంక్ లింకేజి చెక్కులు, కళ్యాణలక్ష్మి, షాదిముబారక్, నేతన్న బీమా చెక్కులను మంత్రి పొన్నం కలెక్టర్ హైమావతితో కలిసి పంపిణీ చేశారు. అనంతరం 1098 చైల్డ్ హెల్ప్ లైన్, మిషన్ వాత్సల్య పోస్టర్లను విడుదలచేశారు.

**ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి : కలెక్టర్**

ప్రజల భాగస్వామ్యంతోనే హుస్నాబాద్ అభివృద్ధి జరుగుతుందని కలెక్టర్ హైమావతి అన్నారు. నియోజకవర్గ స్థాయి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందిస్తున్నామని, జూన్ 2 నుంచి పాఠశాల విద్యార్థులకు అల్పాహారం, జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం ప్రారంభిస్తామని, రైతులు ఆర్గానిక్ వ్యవసాయం వైపు మళ్లాలని సూచించారు.

**సిసి కెమెరాలతో భద్రత పెంపు : సిపి**

సీసీ కెమేరాల ఏర్పాటుతో భద్రత పెరుగుతుందని సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాల్ అన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన సిపి మాట్లాడుతూ సురక్ష నేత్ర కార్యక్రమంద్వారా మూడు నెలల్లో అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రజలు ఎలాంటి సమస్యలైనా పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీ, వైస్ చైర్మన్ చిత్తారి పద్మరవిందర్, కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, బిఆర్ఎస్ శ్రేణులు

## ప్రజా పాలనలో రసాభాస-మైక్ ధ్వంసం

### ధాన్యం కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే నిరసన

**మిరుదొడ్డి (దుబ్బాక), మే 2, ప్రభాతవార్త :** దుబ్బాక పట్టణంలోని కోమటి రెడ్డి రజనీకాంత్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో శనివారం ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమం రసాబాసగా మారింది. ప్రజాపాలనపై ఉన్న శ్రద్ధ ధాన్యం కొనుగోలుపై లేదని బిఆర్ఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రజాపాలన కార్యక్రమంలో నిరసన వ్యక్తం చేస్తూ మైక్ ధ్వంసం చేశారు. ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్‌చేస్తూ ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి స్టేజీ కింద కూర్చొని నిరసన తెలిపారు. స్టేజీపై మైక్ ధ్వంసం చేయడంతో ఒక్కసారి ఉద్రిక్తత ఏర్పడింది. దుబ్బాక నియోజకవర్గస్థాయి ప్రజాపాలన కార్యక్రమంలో కొద్దిసేపు స్టేజీపై కూర్చొని అనంతరం కిందికి దిగి బిఆర్ఎస్ నాయకులతో కలిసి ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే స్టేజీపైకి వెళ్లి మాట్లాడుతుండగా మైక్‌కట్ చేశారు. వెంటనే ఎమ్మెల్యే ఆవేశంతో మైకులు ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండితే అందులో దుబ్బాక నియోజకవర్గంలో 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండుతుందన్నారు. మాజీ సిఎం కెసిఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా అందిస్తున్న సాగునీటి ఫలితంగానే ధాన్యం పండుతుందన్నారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం అమ్ముకొవడానికి రైతులు నానా ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. మాకు ప్రజా పాలన కాదు రైతుల ముఖ్యమన్నారు. ఈ సందర్భంగా సిఎంకు, జిల్లా అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు హోరెత్తించారు.

## బహిరంగ సభను విజయవంతం చేయాలి

### బిజెపి ఒబిసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాపగారి రమేష్‌గౌడ్

**నర్సాపూర్, మే 2, ప్రభాతవార్త :**

ఈ నెల 10వ తేదీన సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్లో జరగనున్న జనగ్రహ బహిరంగ సభను విజయవంతం చేయాలని బిజెపి ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి రమేష్‌గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం నర్సాపూర్ పట్టణంలోని బిజెపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు ఈ సందర్భంగా ఓబిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి రమేష్‌గౌడ్ మాట్లాడుతూ సికింద్రాబాద్‌లోని పెరేడ్ గ్రౌండ్లో ఈనెల 10వ తేదీన జనగ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బహిరంగ సభకు దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. ఇటీవల పార్లమెంటులో బిజెపి ప్రభుత్వం నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో మహిళా బిల్లును ప్రవేశపెట్టగా కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించిందని అన్నారు. దీంతో మహిళా బిల్లు పార్లమెంట్‌లో ఆమోదించబడలేదని దీంతో దేశంలోని 70 కోట్ల మంది మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ఉద్దేశంతో మహిళా బిల్లును ప్రవేశపెడితే కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించడం సహించరానిదన్నారు. ఈ మేరకు ఈ నెల 10న జరిగే జన గ్రహ బహిరంగ సభకు కార్మికులు కర్షకులు ఉద్యోగులు మేధావులు విద్యార్థులు సబ్బండ వర్గాల వారు అధిక సంఖ్యలో బహిరంగ సభకు హాజరై విజయవంతం చేయాలని పాప గారి రమేష్ గౌడ్ కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి బాదే బాలరాజ్ నర్సాపూర్ పట్టణ అధ్యక్షులు నీరుడి చంద్రయ్య, ప్రధాన కార్య దర్శులు బోర్ వెల్ రాంరెడ్డి,సంఘసాని రాజు పాల్గొన్నారు

## వడదెబ్బకు గిరిజన రైతు మృతి

**అల్లాదుర్గం, మే 2, ప్రభాతవార్త:**

మండుతున్న ఎండలకు వడ దెబ్బ తిగిలి గిరిజన రైతు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కోమటి కుంట గిరిజన తండాలో శనివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... కోమటికుంటకు చెందిన బాన్యనాయక్(55) మేకలను గిరిజన తండా పరిసరాల్లో మేతకై తీసుకెళ్లి మేపుతుండగా ఒక్కసారిగా అతడు పడిపోవడంతో గమనించిన గిరిజనులు జోగిపేట ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బాన్యనాయక్ మృతి చెందాడు. పేదలైన బాన్య నాయక్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబ సభ్యులతో పాటు తండా వాసులు వినతి చేస్తున్నారు.

# పేదలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

### వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

**జోగిపేట, మే 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నప్పటికి ప్రధానంగా పేద కుటుంబాలకు అత్యుత్తమ ప్రమాణాలతో కూడిన విద్యతోపాటు మెరుగైన వైద్యం అందించాలనే తపనతో ప్రభుత్వం ఉందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. శనివారం జోగిపేటలో శ్రీరామ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొంభై శాతం వైద్య సేవలు జిల్లా స్థాయిలోనే అందించాలనే ధృఢ సంకల్పంతో ప్రభు త్వం ఉందన్నారు. అందులో భాగంగానే ఇప్పటికే ఉన్న వాటికి అదనంగా మరో 80 డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే ప్రమాదాలు జరిగిన సందర్భంలో పదిహేను నిమిషాల్లోనే గాయాల బారిన పడినవారికి మందస్తు చికిత్స అందేవిధంగా ప్రతీ ముప్పై కిలో మీటర్ల దూరంలో ట్రామా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇవే కాకుండా జిల్లా స్థాయిలోనే తొంభైశాతం వైద్య సేవలందించే విధంగా ప్రభుత్వ ఆసుపత్రులకు బలోపేతం చేస్తున్నామని అన్నారు. తీవ్రమైన రోగాలయితే తప్ప హైదరాబాద్‌కు రావాల్సిన అవసరం లేకుండా వైద్యసేవలను జిల్లా స్థాయిలోనే అందుబాటులోకి తీసుకు వస్తున్నామని తెలిపారు. ఇవే కాకుండా మూడు టిమ్స్ ఆసుపత్రులకు అందుబాటులోకి తీసుకు వస్తున్నామని, ఇప్పటికే సనత్‌నగర్ టిమ్స్‌లో ట్రయల్ ప్రారంభించామని ఆయన తెలిపారు. ఆర్థికంగా వెకనబడిన వారికీ కార్పోరేట్ స్థాయి వైద్య సేవలందించాలనే ఉద్దేశంతో తమ ప్రభుత్వం వైద్య శాఖలో పలు సంస్కరణలు తీసుకువచ్చినట్లు ఆయన తెలిపారు. ఇకపోతే విద్య విషయానికి వస్తే సమాజం బాగుండాలంటే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా చదువుకోవాలని, ముఖ్యంగా బాలికా విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని మంత్రి తెలిపారు. ఈ మేరకు విద్యావిధానంలో పలు మార్పులు తీసుకొచ్చి ప్రమాణాలతో కూడిన విద్యను అందించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని ఆయన అన్నారు. అందోలు త్వరలో ఎడ్యుకేషన్ హబ్‌గా మారబోతుందని, త్వరలో అందోలుకు ఫార్మసీ కళాశాల వస్తుందని ఆయన తెలిపారు. బస్వాపూర్‌లో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలను నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. వీటితోపాటు అందోలు నియోజకవర్గ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యల గురించి మంత్రి వివరించారు.



మాట్లాడుతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పారితోష్ పంకజ్, అడిషనల్ కలెక్టర్ పాండు, అందోలు-జోగిపేట మున్సిపాలిటీ ఛైర్మెన్ ఎస్.క్రిష్ణారెడ్డి, జోగిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మెన్ ఎం.జగన్మోహన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మెన్ చిట్టిబాబు, తహసీల్దార్ మధకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవీందర్, ఎంపిడివో రాజేశ్ కుమార్, ట్రాన్స్‌కో డిఇ శ్రీనివాస్, మాజీ మున్సిపల్ ఛైర్మెన్ గూడెం మల్లయ్య, కాంగ్రెస్ కౌన్సిలర్లు కొశికె రాజశేఖర్, శ్రీనివాస్, రామక్రిష్ణ, కాంగ్రెస్ నాయకులు పట్లోల్ల ప్రవీన్‌కుమార్ పాల్గొన్నారు.

## ఉరేసుకుని సెక్యూరిటీ గార్డ్ ఆత్మహత్య

**శివ్వంపేట, మే 2(ప్రభాతవార్త) :**

జీవనోపాధికై పొరుగు రాష్ట్రం నుండి తెలంగాణ రాష్ట్రానికి వచ్చి మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని శివ శక్తి కంపెనీలో సెక్యూరిటీ గార్డ్‌గా చేస్తూ ఆత్మహత్య చేసుకోగా కుళ్లిన మృత దేహం శనివారం భోజ్యతాండ గ్రామపంచాయతీలో వెలుగులోకి వచ్చింది. భోజ్యతాండ పంచాయతీ కార్యదర్శి కృష్ణ కథనం ప్రకారం... భోజ్యతాండ డంపింగ్‌యార్డ్‌ను పరిశీలించడానికి పంచాయతి కార్యదర్శి కృష్ణ వెళ్లగా బాత్ రూం వద్ద చెట్టుకు ఈగలు ముసురుతూ కనిపించడంతో అనుమానం వచ్చి డోర్ తెరిచి చూడగా కుళ్లిపోయి వ్యక్తి మృతదేహం కనిపించింది. మృతదేహం నడుముకు గల బెల్టును పరిశీలించగా సెక్యూరిటీ గార్డ్ బెల్టు శివశక్తి కంపెనీకి చెందినదిగా గుర్తించి వెంటనే శివశక్తి సెక్యూరిటీ ఇన్‌చార్జిని ఘటనా స్థలానికి రప్పించి మృతదేహాన్ని పరిశీలింప చేయగా అతను కంపెనీలో సెక్యూరిటీ గార్డ్ విధులు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు మృతుడు అస్సాం రాష్ట్రానికి చెందిన దుర్బ జ్యోతి బర్వ (40)గా గుర్తించడం జరిగింది. రెండేళ్లుగా శివశక్తి కంపెనీలో సెక్యూరిటీ గార్డ్‌గా విధులు నిర్వహిస్తున్నప్పటికీ 14 రోజుల క్రితం విధులు సక్రమంగా చేయడం లేదని సెక్యూరిటీ గార్డ్ నుండి తొలగించడం జరిగిందని సెక్యూరిటీ గార్డ్ ఇన్‌చార్జి తెలిపారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్లో పంచాయతీ కార్యదర్శి కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు శివంపేట పోలీసులు తెలిపారు.

## బైక్‌పై నుంచి పడి వ్యక్తి మృతి

**జహీరాబాద్, మే 2 (ప్రభాతవార్త):** మండలంలోని ఆనేగుట్ట శివారులో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. చిరాకుపల్లి ఎస్సై రాజేందర్‌రెడ్డి కథనం ప్రకారం... జహీరాబాద్ మండలం ఆనేగుంట గ్రామానికి చెందిన గంట వెంకటి శుక్రవారం రాత్రి బైక్‌పై జహీరాబాద్ నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా గ్రామ సమీపంలో రోడ్డు పక్కన ఉన్న ఎర్రరాయి రాళ్లను బైక్ ఢీకొట్టింది. దీంతో వెంకటి బైక్‌పై నుంచి ఎగిరి పడి రాళ్లపై పడటంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఇదిలా ఉండగా, ప్రమాదంలో మృతి చెందిన గంట వెంకటి మృతదేహాన్ని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ఆసుపత్రిలో పరిశీలించారు. ఆయనతో పాటు చిరాకుపల్లి ఎస్సై రాజేందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు తట్టు నారాయణ, మాజీ సర్పంచ్ జగదీష్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## ట్రాక్టర్ బోల్తాపడి రైతు మృతి

**చిన్నకోడూరు, మే 2, ప్రభాతవార్త :** మండల పరిధిలోని అల్లీపూర్ గ్రామంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తాపడి రైతు మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. ట్రాక్టర్‌తో పొలంలో వరి కట్టలు కడుతున్న సమయంలో ప్రమాదవశాత్తు బోల్తాపడడంతో నిమ్మకాయల రామస్వామి(40) రైతు అక్కడికక్కడే మృతిచెందారు. బాధితుల ఫిర్యాదు మేరకు చిన్నకోడూరు పోలీసులు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**పాపన్నపేట, మే 2, ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని అన్నారం గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ కథనం ప్రకారం... అబ్లాపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి బాల్‌రాజు(30) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం ఉదయం పని నిమిత్తం బైక్‌పై మెదక్ వెళ్లి రాత్రి సమయంలో తిరిగి ఇంటికి వస్తుండగా అన్నారం గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ బైక్‌ను ఢీ కొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై నుంచి బాల్ రాజు కిందపడి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఇది గమనించున స్థానికులు పాపన్నపేట పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించి మృతుడి భార్య శైలజ ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## తల్లిదండ్రుల మృతిని తట్టుకోలేక యువకుడి ఆత్మహత్య

### కుటుంబంలో అందరినీ కోల్పోయి అనాధగా మారిన మానస

**సదాశివపేట, మే 2 (ప్రభాతవార్త):** చిన్న కుటుంబంగా సంతోషంగా జీవనం సాగిస్తున్న ఓ కుటుంబంపై వరుస విషాదాలు విరుచుకుపడ్డాయి. వారం రోజుల వ్యవధిలో తల్లిదండ్రులను కోల్పోయిన కుమారుడు కూడా ఆత్మహత్య చేసుకోవడంతో స్థానికంగా తీవ్ర విషాదం నెలకొంది. ఈ ఘటన సదాశివపేట పట్టణంలోని సిద్ధాపూర్ కాలనీలో చోటుచేసుకుంది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 24వ తేదీన జీవరత్నం అలియాస్ రాజు భార్య రాణిని హత్య చేసి, అనంతరం ఆత్మహత్య చేసుకున్నాడు. రోజు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించే ఈ దంపతులకు కుమారుడు మధు, కుమార్తె మానస ఉన్నారు. మధు డ్రైవింగ్ పనిచేస్తుండగా, మానస ప్రభుత్వ గురుకుల కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. తల్లిదండ్రుల ఆకస్మిక మృతిని జీర్ణించుకోలేకపోయిన మధు శనివారం సదాశివపేట సమీపంలోని తేజ వెంచర్ ప్రాంతంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఒకే కుటుంబంలో వరుసగా ముగ్గురు మృతి చెందడంతో కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబంలో అందరినీ కోల్పోయిన మానస తీవ్ర మనోవేదనకు గురవుతోంది. ప్రభుత్వం స్పందించి ఆమెకు ఆర్థిక, మానసిక పరమైన సహాయం అందించాలని స్థానికులు కోరుతున్నారు.

## విద్యుత్ షాక్‌తో గేదె మృతి

**అల్లాదుర్గం, మే 2, ప్రభాతవార్త:** విద్యుత్ షాక్‌తో గేదె మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని గొల్లకుంట గిరిజన తండాలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. తండాకు చెందిన విస్లావత్ శోభిబాయ్ తండా సమీపంలో ఉన్న విద్యుత్ నియంత్రిక తీగలకు ప్రమాదావశాస్తు తగిలి మృతి చెందింది. మృతి చెందిన గేదె విలువ రూ. 70 వేల వరకు ఉంటుందని బాధితూలు కన్నీరుమున్నీరయ్యారు. గేదె మృతితో కుటుంబం పరిస్థితి దయనీయంగా మారిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు శోభిబాయ్ వినతి చేశారు.



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన గేదె

## చలివేంద్రాలు బాట సారుల దప్పిక తీరుస్తాయి : ఎమ్మెల్యే తలసాని



చలివేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేస్తున్న తలసాని, అరుణాగౌడ్.

**బేగంపేట మే 2, ప్రభాతవార్త**

వేసవి కాలంలో ఏర్పాటు చేసే చలి వేంద్రాలు బాటసారుల దప్పిక తీరుస్తాయని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం రాంగోపాల్‌పేట డివిజన్ లోని రాణిగంజ్ లో బీఎంఎస్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాణిగంజ్ మార్కెట్ కు ప్రతి నిత్యం వివిధ ప్రాంతాల నుంచి అనేక మంది ప్రజలు వస్తుంటారని, వారి దప్పిక తీర్చేలా ఇక్కడ చలి వేంద్రాన్ని ఏర్పాటు చేయడాన్ని ఎమ్మెల్యే అభినందించారు. బీఎంఎస్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాడటమే కాకుండా సేవా కార్యక్రమాలు కూడా నిర్వహించడాన్ని తలసాని అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్లు అత్తెల్లి మల్లిఖార్జున్ గౌడ్, అత్తెల్లి అరుణాగౌడ్, అత్తెల్లి శ్రీనివాస్‌గౌడ్, బీఎంఎస్ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, కుమార్, మహేష్ గౌడ్, జహంగీర్, మల్లేష్ గౌడ్ బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## నాదెండ్లకు ఘన నివాళులు



నాదేండ్ల భాస్కర్‌రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, చిత్రంలో ఆర్.లక్ష్మణ్‌యాదవ్, తొలుపునూరి కృష్ణగౌడ్, నారాయణస్వామి, ఎస్.హరినాథ్‌రెడ్డి తదితరులు

**హైదరాబాద్, మే 2 ప్రభాతవార్త**

మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నాదేండ్ల భాస్కర్‌రావుకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ ఎంపి వి.హనుమంతరావు ఘనంగా నివాళులర్పించారు. శనివారం జూబ్లీహిల్స్‌లో జరిగిన ఆయన వర్థంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భాస్కర్‌రావు కుమారుడు, ఏపీ మంత్రి నాదేండ్ల మనోహర్ తదితర కుటుంబ సభ్యులను ఆయన కలిసి మనోధైర్యం కల్పించారు. భాస్కర్‌రావుతో తనకున్న పరిచయాన్ని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ పి.నారాయణస్వామి, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణాగౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎస్.హరినాథ్‌రెడ్డి, దేవిరెడ్డి విజితారెడ్డి, దిలిప్‌కుమార్ తదితరులు నాదెండ్ల భాస్కర్‌రావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

## ఉపాధ్యాయుల సాధికారతతోనే నాణ్యమైన విద్య

**ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్**



కార్యక్రమంలో పాల్గొన్న ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్

**చిక్కడపల్లి మే 2 ప్రభాతవార్త :** ఉపాధ్యాయుల సాధికారతతోనే నాణ్యమైన విద్య సాధ్యమవుతుందని రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్ అన్నారు. శనివారం బాగ్ లింగంపల్లి డాక్టర్ బి.ఆర్. అంబెద్కర్ విద్యాసంస్థలు, ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ముగిసింది. ఫ్యాకల్టీ ఎంగేజ్‌మెంట్ విత్ స్టూడెంట్స్ ఫర్ అవుట్‌కమ్ బేస్డ్ అండ్ ఎక్స్‌పీరియెన్షియల్ లెర్నింగ్" అనే అంశంపై అధ్యాపకులకు ఈ శిక్షణ ఇచ్చారు. ముఖ్య అతిథి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఉన్నత విద్య అంతా ఫలితాధారిత అభ్యాసం పైనే ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. బోధన, పరిశోధన, మూల్యాంకన ప్రక్రియలను సమాజ అవసరాలకు అనుగుణంగా మార్చుకోవాలని ఆయన సూచించారు. 2020లో భాగంగా బహుళవిషయ విద్య ప్రాముఖ్యతను ప్రొఫెసర్ రాములు వివరించారు. ప్రొఫెసర్ వి.ఎస్. ప్రసాద్ విద్యార్థుల సాధికారత గురించి ప్రసంగించగా, ప్రొఫెసర్ ఎస్. శ్రీనివాస మూర్తి భారతీయ సంస్కృతి, విలువల ప్రాముఖ్యతను గుర్తుచేశారు. డా. కె. ఉషారాణి స్మార్ట్ టూల్స్ వినియోగంపై సెషన్ నిర్వహించారు. కళాశాల సీఈఓ ప్రొఫెసర్ లింబాద్రి, డైరెక్టర్ ప్రొఫెసర్ యాదగిరి, ప్రిన్సిపాల్ డా. మట్టా శేఖర్, నోడల్ ఆఫీసర్ డా. జి. కృష్ణ శర్మల పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులకు చివరగా సర్టిఫికెట్లు అందజేశారు. జాతీయ గీతాలాపనతో ఈ ఐదు రోజుల సదస్సు ముగిసింది.

## కార్మికులను గౌరవిస్తేనే దేశాభివృద్ధి : బక్కని నర్సింహులు



కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు, టీఎన్టీయూసీ మాజీ అధ్యక్షుడు ఎం కె.బోస్

**చిక్కడపల్లి మే 2 ( ప్రభాతవార్త ) :**

కష్టపడేవారిని గౌరవించే విధానం పెరిగినప్పుడే దేశం మూడు పువ్వులు ఆరు కాయలుగా అభివృద్ధి సాధిస్తుందని మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు అన్నారు. శనివారం టీఎన్టీయూసీ మాజీ అధ్యక్షుడు ఎం కె.బోస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. చారిత్రక సంస్కరణలలో భాగంగా ఎన్టీఆర్ పటేల్‌పట్వారీ వ్యవస్థను రద్దు చేయడం వల్లే తెలంగాణలో వెట్టిచాకిరీ అంతమైందని, శ్రమ శక్తి అవార్డులతో శ్రమకు గుర్తింపు లభించిందని గుర్తుచేశారు. టీఎన్టీయూసీ మాజీ అధ్యక్షుడు ఎం కె.బోస్ మాట్లాడుతూ శ్రమశక్తి అవార్డుల పంపిణీలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం వలె ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పక్షపాతంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నేతలు బంటు వెంకటేశ్వర్లు, అజ్మీరా రాజునాయక్, శ్రీపతి సతీష్, పోలంపల్లి అశోక్, కసిరెడ్డి శేఖర్ రెడ్డి, వేజెండ్ల కిశోర్ బాబు, మండవ వెంకటేష్ గౌడ్ మరియు టీఎన్టీయూసీ నాయకులు ఎబిఆర్ మోహన్రావు, జగదీష్, కె. రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి సారస్వత పరిషత్తు పురస్కారం

**నాంపల్లి, మే 2 ప్రభాతవార్త :** సుప్రీం కోర్టు పూర్వ న్యాయమూర్తి, ప్రముఖ న్యాయకోవిదుడు జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డికి డా. ఎం. శ్రీధర్‌రెడ్డి ధర్మనిధి సాహిత్య పురస్కారం ప్రదానం చేయాలని తెలంగాణ సారస్వత పరిషత్తు నిర్ణయించినట్లు పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా. జె.చెన్నయ్య పేర్కొన్నారు. సారస్వత పరిషత్తులోని డా. దేవులపల్లి రామానుజరావు కళావేదిక 5 మంగళవారం ఉద యం 10.30లకు పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగే సభలో తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికా మండలి ఉపాధ్యక్షుడు డా. జి.చిన్నారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి పురస్కారం ప్రదానం చేస్తారని వివరించారు. పురస్కారం కింద 25వేల రూపాయల నగదు, జ్ఞాపిక, శాలువా, ప్రశంసాపత్రంతో ఘనంగా సత్కరించనున్నట్లు చెన్నయ్య వెల్లడిం చారు. తొలిదశ తెలంగాణ ఉద్యమకారుడు డా. శ్రీధర్‌రెడ్డి పేరుతో ఆయన భార్య డా. విజయలక్ష్మి పరిషత్తులో నిధిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## 5న ధర్నాచౌక్ వద్ద ఆటో, ప్రైవేటు రవాణా కార్మికుల ధర్నా

**చిక్కడపల్లి మే 2 ,ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలోని ఆటో మరియు ప్రైవేటు రవాణా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం, ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5వ తేదీన ధర్నాచౌక్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు భారతీయ ప్రైవేట్ ట్రాన్స్ పోర్ట్ మజ్దూర్ మహా సంఘ్ ప్రకటించింది. ఈ మేరకు శనివారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్ బి ఎం ఎస్ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో బీపీటీఎంఎం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ అల్లూరి వివరాలు వెల్లడించి ధర్నాకు సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆటో డ్రైవర్ల పరిస్థితి దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి కోల్పోయి డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. పోలీస్, ఆర్టీఓ చలానాల మోత పెరిగిందని, దీనికి తోడు ఓలా, ఊబర్, ర్యాపిడో వంటి సంస్థల అక్రమ బైక్ టాక్సీల వల్ల ఆటో డ్రైవర్ల ఆదాయం దెబ్బతింటోందని మండిపడ్డారు. తెలంగాణ స్టేట్ ఆటో టాక్సీ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు నంద కిషోర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన



మహాధర్నా కు సంబంధించి కరపత్రాన్ని విడుదల చేస్తున్న సంఘ్ ప్రధాన కార్యదర్శి రవి శంకర్, చిత్రంలో ఆటో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.పెంటయ్య గౌడ్ , మహా సంఘ్ రాష్ట్ర అధ్యక్షులు లిఖిత్ కుమార్, ప్రధాన కార్యదర్శి కె.శ్రీధర్ రెడ్డి

హామీలను ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. రవాణా కార్మికుల కోసం తక్షణమే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గూడ్స్ వాహనాలు, అంబులెన్సులకు ప్రత్యేక పార్కింగ్ స్థలాలు కేటాయించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆటో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.పెంటయ్య గౌడ్ , మహా సంఘ్ రాష్ట్ర అధ్యక్షులు లిఖిత్ కుమార్, ప్రధాన కార్యదర్శి కె.శ్రీధర్ రెడ్డి విమర్శించారు. రవాణా శాఖ భూములను కాపాడలేని ప్రభుత్వం, సామాన్య డ్రైవర్ల వద్ద మాత్రం ముక్కుపిండి చలానాలు వసూలు చేయడం సమంజసం కాదన్నారు.

## విద్యుత్ ఉద్యోగులు,సిబ్బంది తప్పకుండా భద్రతా సూత్రాలు పాటించాలి

**-మెట్రో జోన్ చీఫ్ ఇంజనీరు బిక్షపతి**

**చార్మినార్,మే 2 ప్రభాతవార్త :** విధి నిర్వాహణలో విద్యుత్ ఉద్యోగులు,సిబ్బంది తప్పకుండ భద్రత పరికరాలను ధరించాలని,భద్రత సూత్రాలను పాటించట వల్ల ప్రమాదాలు జరగవని టిజిఎస్‌సిటిసిఎల్ మెట్రోజోన్ చీఫ్ ఇంజనీరు బిక్షపతి అన్నారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చార్మినార్ సబ్ డివిజన్ పరిధిలో శనివారం ఫంజేషాలోని చార్మినార్ ఏడిఈ విద్యుత్ కార్యాలయంలో జరిగిన భద్రత వారోత్సవాల కార్యక్రమానికి మెట్రో జోన్ చీఫ్ ఇంజనీరు బిక్షపతి ముఖ్య అతిధిగా విచ్చేశారు. చార్మినార్, మొగల్‌పుర, హుస్సేనీఆలంవిద్యుత్ సెక్షన్ల పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు,సిబ్బందికి ఆయన భద్రత పరికరాలు హెల్మెట్లు,ఎర్త్ రాడ్లు,సెఫ్టీ బెల్ట్,హ్యాండ్ గ్లౌజులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మెట్రో జోన్ చీఫ్ ఇంజనీరు బిక్షపతి మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు,సిబ్బంది తప్పకుండ భద్రత సూత్రాలను పాటించాలని కోరారు.సిబ్బంది వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలు అందించి



విద్యుత్ సిబ్బందికి భద్రత పరికరాలు పంపిణీ చేస్తున్న టిజిఎస్‌పిటిసిఎల్ మెట్రో జోన్ చీఫ్ ఇంజనీరు బిక్షపతి

సంస్థకు మంచి పేరు తీసుకోవాలని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో టిజిఎస్‌పిటిసిఎల్ సౌత్ సర్కిల్ ఎస్ఈ టి.శ్రీనివాస్,చార్మినార్ డిఈ ఎం.శ్రీధర్,చార్మినార్ ఏడిఈ సయ్యద్ మక్సూద్,చార్మినార్ సిబిడి ఏడిఈ మహ్మద్ అక్బర్,ఫలక్‌నుమా సిబిడి ఏడిఈ రాజేందర్‌సింగ్, చార్మినర్ ఏఈ మహ్మద్ అబ్దుల్ నసీర్,హుస్సేనీఆలం ఏఈ రాములు,చార్మినార్ సబ్ ఇంజనీరు సంతోష్‌తో పాటు విద్యుత్ ఉద్యోగులు,సిబ్బంది పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్

**చార్మినార్,మే 2 ప్రభాతవార్త :** ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించటంతో పాటు లబ్ధి చేకూరేలా పాతబస్తీలో మజ్లిస్ కృషి చేస్తున్నదని బహదూర్‌పుర నియోజకవర్గం శాసన సభ్యులు మహ్మద్ ముబీన్ అన్నారు.బహదూర్‌పురలో శనివారం నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక బహదూర్‌పుర నియోజకవర్గం స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా విచ్చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రభుత్వ వివిధ శాఖల సమన్వయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని,నియోజకవర్గంలోని పేద ప్రజలకు రేషన్ కార్డులు పంపిణీ చేశామని తెలిపారు.ప్రజలు సంక్షేమ పథకాలను అన్ని విధాల సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలియజేశారు.నియోజకవర్గంలోని మహిళా గ్రూపులకు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్

ఆయన 88 లక్షల రూపాయల చెక్కును అందజేశారు.ఈ కార్యక్రమంలో బహదూర్‌పుర మండలం తహసీల్దార్ బాల శంకర్,బహదూరపుర నోడల్ అధికారి కోటాజీ, ఏఎస్‌ఓ అస్లాంఖాన్,ఎంఐఎం కార్పొరేటర్లు హుస్సేనీపా షా, మహ్మద్ సలీం,ముజాఫర్ అలీ,మాజీ కార్పొరేటర్ ఎంఎ గఫార్‌తో పాటు ప్రభుత్వ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

## 5 నుంచి సైకాలజిస్ట్స్ అసోసియేషన్ దశాబ్ది ఉత్సవాలు

**సైఫాబాద్, మే 2 ప్రభాతవార్త:**

దశాబ్దకాలం పాటు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ సేవా కార్యక్రమాలను అందించిన 'తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ దశాబ్ది ఉత్సవాలు' ఈ నెల 5వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోతుకూరి రాంచందర్ తెలిపారు. ఈ పదేళ్ళ కాలంలో మానసిక ఆరోగ్య రంగంలో చేసిన సేవలను మననం చేసుకుంటూ వివిధ సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని శనివారం నాడిక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన చెప్పారు. 5వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో కేకులు కటింగ్‌లు, 6, హ్యాపి హోమ్స్ పేరిట ఎంపిక చేసిన అపార్ట్‌మెంట్‌లలో మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సులు, 7న ఫోటో ఎగ్జిబిషన్, 9న హోటల్ క్షత్రియలో మానసిక ఆరోగ్య రంగంలో దశాబ్దపు ప్రగతిపై చర్చ, 10న ఫిల్మ్‌నగర్ కల్చరల్ క్లబ్‌లో దశాబ్ది ఉత్సవాల పురస్కారాల వేడుకలు, 12, 13న తెలంగాణ వెల్‌నెస్ వాక్, 15న ఉచిత వెబ్‌నార్ల శ్రేణి: యువత ప్రవర్తనా సమస్యలపై రాష్ట్ర స్థాయిలో ఉచితం ఆన్‌లైన్ అవగాహన సదస్సులు, ముగింపు కార్యక్రమం జరుగుతుందని ఆయన వివరించారు.

## వ్యాధిగ్రస్తులకు మెరుగైన సేవలందిస్తున్నాం

**: నిలోఫర్ సూపరింటెండెంట్ ఆచార్య విజయకుమార్**



జెండా ఆవిష్కరించి విజయకుమార్, లాలూప్రసాద్, వినోద్‌కుమార్, ఆనంద్, నాగజ్యోతి, సత్యం, భూమయ్య తదితర అతిథులు

**నాంపల్లి, మే 2 ప్రభాతవార్త :**

ఆస్పత్రికి వచ్చిన వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యసేవలు అందించి ఆస్పత్రికి, ప్రభుత్వానికి మంచిపేరు తీసుకు రావాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆచార్య విజయకుమార్ సూచించారు. రాష్ట్రానికే తలమానికంగా నిలుస్తున్న నిలోఫర్‌లో నానాటికీ పెరుగుతున్న రోగుల సంఖ్యను దృష్టిలో పెట్టుకుని ఆధునాతన చికిత్స, వసతులు, వైద్య పరికరాలు, అత్యున్నతస్థాయిలో వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రపంచ కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని విజయకుమార్ తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం కార్యదర్శి డా. లాలూప్రసాద్ రాథోడ్, ఆచార్య వినోద్‌కుమార్, వైద్యులు ఆనంద్, నాగజ్యోతి, ఏఐటియుసీ బ్రాంచ్ అధ్యక్షుడు సుందర్, ఉపాధ్యక్షుడు సత్యం, ప్రధాన కార్యదర్శి రాజు, కోశాధికారి భూమయ్య, యాదన్న, నాయకులు సంజీవ్ చారి, సత్యనారాయణగౌడ్ తదితరులతో కలిసి జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ముందుగా కార్మికులు, ఉద్యోగులకు మే డే శుభాకాంక్షలు తెలుపుతూ ఆస్పత్రి సిబ్బంది 24గంటలపాటూ రోగులకు విశిష్ట సేవలు అందిస్తున్నారని, ఇకముందు అదే సేవాభావంతో ముందుకుసాగాలని పిలుపునిచ్చారు.

## హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి



**అత్తాపూర్ మే2 ,ప్రభాతవార్త :** హిందూ సమ్మేళనానికి పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని హిందూ సమ్మేళనం కమిటీ సభ్యులు పేర్కొన్నారు. శనివారం శివరాంపల్లి శిశు మందిర్ పాఠశాలలో రాబోయే హిందూ మహా సమ్మేళనానికి సంబంధించిన ముందస్తు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ధర్మ పరిరక్షణతో పాటు సమాజంలోని అన్ని వర్గాల మధ్య ఐక్యతను పెంపొందించే అంశాలపై ప్రధానంగా చర్చించారు. ఐక్యత, సాంస్కృతిక విలువలు మరియు సామూహిక బాధ్యతల ప్రాముఖ్యతను స్పష్టంగా ప్రస్తావించారు. ఈ కార్యక్రమం పూర్తిగా సామాజిక సమరసత మరియు సమాజ శ్రేయస్సు కోసమే నిర్వహించబడుతోందని, దీనికి ఎలాంటి రాజకీయ సంబంధం లేదని నిర్వాహకులు స్పష్టం చేశారు. సమావేశం ముగింపులో "ధర్మమే మన శ్వాస – ఐక్యతే మన బలం" అనే సందేశంతో పాటు యువత ముందుకు వచ్చి సమ్మేళనంలో చురుకుగా పాల్గొని సంప్రదాయాల పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అధ్యక్షులు మల్లెల శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీ ఎస్. చంద్ర రెడ్డి, కమిటీ సభ్యులు మరియు శివరాంపల్లి పెద్దలు పాల్గొన్నారు. విడుదల చేసినవారు

## విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు : ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**అత్తాపూర్ మే2 ,ప్రభాతవార్త :** విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మంచిగా చదవి ఉన్నత శిఖరాలకు ఎదిగాలని నియోజకవర్గంలో విద్య అభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. శనివారం పదవ తరగతి పరీక్షా ఫలితాలలో రాజేంద్రనగర్ మండలంలోని అత్యధిక మార్కులు సాధించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి మహేష్ 548, ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థిని రూపశ్రీ 508 , అలాగే ఆంగ్ల మాధ్యమంలో పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థిని చాందిని 518లను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఘనంగా సన్మానించి ప్రశంసించారు.ఈ సందర్భంగా విద్యార్థులను మీరు భవిష్యత్తులో బాగా కష్టపడి చదివి మరింత ఉన్నత స్థాయికి ఎదిగాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత, పి ఆర్ టి యు రాజేంద్రనగర్ మండల శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస సాగర్, పి ఆర్ టి యు స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ రాజశేఖర్ గౌడ్, పాఠశాల ఉపాధ్యాయులు సాయి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## మంగ్లీపై పథకం ప్రకారమే కుట్ర : మోతిలాల్ నాయక్

**-సిబిసిఐడిచే విచారణ జరిపించాలని సిఎంకు విజ్ఞప్తి**

**సైఫాబాద్, మే 2 ప్రభాతవార్త:** ప్రముఖ గాయని, గిరిజన బిడ్డ మంగ్లీ ఎదుగుదలని చూసిన కొందరు ఓర్వలేక కొన్ని యూ ట్యూబ్ ఛానల్స్‌లో అసభ్యకర వ్యాఖ్యలు చేస్తూ ఆమెను అభాసుపాలు చేస్తున్నారని సేవాలాల్ బంజారా సంఘం అధ్యక్షుడు మోతిలాల్ నాయక్ ఆరోపించారు. ఒక పథకం ప్రకారం కుట్ర పూరితంగా ఆమెను వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తున్నారని, ఛానల్స్ పనిగట్టుకుని వ్యూస్ కోసం మంగ్లీపై ఇష్టారీతిలో అసభ్యకరంగా గ్లోబల్ ప్రచారం చేస్తూ కుటుంబాన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసు పోలీస్ దర్యాప్తులో ఉందని, మంగ్లీ తప్పు చేస్తే పోలీసులు ఎక్కడికి రమ్మంటే అక్కడకు రావడానికి మంగ్లీ సిద్ధంగా ఉందన్నారు. అన్యాయంగా మంగ్లీ జోలికి వస్తే సహించేది లేదని, ఆమెకు రెండు తెలుగు రాష్ట్రాలలో బంజారాలు అండగా ఉన్నారని,



సమావేశంలో మాట్లాడుతున్న మోతిలాల్‌నాయక్

ఆమెను ఎవరైనా దూషిస్తే నాలుక కొస్తామని హెచ్చరించారు. మైక్రో ఫైనాన్స్ విషయంలో నిజా నిజాలు నిగ్గు తెల్చడానికి సిఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర డిజిపి చోరవ తీసుకుని ఈ కేసును సిబిసిఐడిచే విచారణ జరిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సంఘం ప్రతినిధులు రవీందర్‌నాయక్, ధరావత్ గణేష్‌నాయక్, అభిషేక్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్‌తో కొట్టి అత్తను చంపిన అల్లుడు.

**హైదరాబాద్, మే 2 ప్రభాతవార్త**

భార్య మీద కోపంతో ఓ వ్యక్తి అత్తను చంపేశాడు. బైక్‌పై వెళ్తుండగా హెల్మెట్‌తో తలపై కొట్టడంతో కిందపడి తీవ్రగాయాలై అత్త మరణించింది. ఆ తర్వాత ఏమీ తెలియనట్లుగా ఫిట్స్ వచ్చి కిందపడటంతోనే ఈ ప్రమాదం జరిగిందని అందర్నీ నమ్మించే ప్రయత్నం చేశాడు. కానీ భార్యకు అనుమానం వచ్చి అక్కడి సీసీ ఫుటేజ్‌ను పరిశీలించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది.మేడ్చల్ జిల్లా చెంగిచర్ల ఆర్టీసీ కాలనీకి చెందిన కొల్ల అరుణ (39)కి ఇద్దరు కూతుళ్లు. చిన్న కుమార్తె కావ్య (19) గత ఏడాది కరీంనగర్ చందన్‌పూర్‌కు చెందిన కర్రు స్నేహిత్ (28)ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. కానీ కొద్దిరోజులుగా వారికి మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలోనే గత నెల 29వ తేదీన రాత్రి అరుణకు స్నేహిత్ ఫోన్ చేశాడు. 'నేను పెద్ద కంపెనీలో ఆఫీసర్‌ను. బాసాన్లు తోముకునే నీ కూతుర్ని పెళ్లి చేసుకున్నా.. కానీ నీ కూతురు చిన్న విషయాలకే అలుగుతుంది'అని కోప్పడ్డాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది.ఆ మరుసటి రోజు మధ్యాహ్నం అరుణ దుకాణానికి వెళ్లి వస్తుండగా స్నేహిత్ ఆమెను బైక్‌పై ఎక్కించుకున్నాడు. కొద్దిసేపటికే కావ్యకు కాల్ చేసి.. అత్తమ్మ ఫిట్స్‌తో బండిపై నుంచి కిందపడిపోయింది. బలమైన దెబ్బలు తగలడంతో ఆస్పత్రికి తరలించానని చెప్పాడు. భర్త మాటలతో కంగారు



పడిన కావ్య వెంటనే ఆస్పత్రికి చేరుకుంది. అదే రోజు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అరుణ మరణించింది.అయితే అసలు ఏమైందని స్నేహిత్‌ను నిలదీసినప్పుడు అతని ప్రవర్తనలో తేడా ఉండటాన్ని కావ్య గమనించింది. దీంతో ఘటన జరిగిన చెంగిచర్ల ఆర్టీసీ కాలనీలోని హనుమాన్ ఆలయ సమీపంలో ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలించింది. అందులో అరుణతో స్నేహిత్ గొడవపడి హెల్మెట్‌తో బలంగా కొట్టడం.ఆ దెబ్బకు బైక్‌పై నుంచి ఆమె కిందపడినట్లు స్పష్టంగా రికార్డయ్యింది. ఇదిలా ఉంటే దీంతో తన తల్లి మృతికి భర్తే కారణమని కావ్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా, ఈ హత్యకు సంబంధించిన సీసీ ఫుటేజ్ ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది.

## స్వీయగణనలో పాల్గొన్న న్యాయమూర్తులు



స్వీయగణనలో పాల్గొన్న జస్టిస్ నాగేష్ భీమపాక

**జూబ్లీహిల్స్, మే 2, ప్రభాతవార్త:**

జూబ్లీహిల్స్ సర్కిల్–36 పరిధిలోని న్యాయవిహార్‌లో పలువురు న్యాయమూర్తులు స్వీయ గణన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ నాగేష్ భీమపాక, జస్టిస్ మాధవీదేవి, జస్టిస్ ఎన్. తుకారాంజీ, జస్టిస్ కె. సృజన, జస్టిస్ కె. శరత్, జస్టిస్ చాడ విజయ భాస్కర్ రెడ్డి పాల్గొని స్వీయ గణన పూర్తి చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు స్వీయగణనకు సంబంధించిన పోస్టర్లను ప్రదర్శించారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## మానవత్వానికి నిలువెత్తు రూపం దుద్దు సుబ్రహ్మణ్యం



దుద్దు సుబ్రహ్మణ్యం దంపతులను సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి మే 2 ( ప్రభాతవార్త ) :** మానవత్వానికి నిలువెత్తు రూపం దుద్దు సుబ్రహ్మణ్యం అని ద్యుతి మ్యూజికల్ అకాడమీ అధినేత, ప్రముఖ సంఘసేవకుడు పేరి నాగేశ్వర్ రావు అన్నారు. శనివారం సుబ్రహ్మణ్యం చేస్తున్న సేవలకు గుర్తింపుగా చిక్కడపల్లి త్యాగరాయగానసభలో ద్యుతి మ్యూజికల్ అకాడమీ, ఇషాన్ ఫౌండేషన్ , విజయ్ క్రియేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యం దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకురాలు పేరి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఎక్కడ మరణం సంభవించినా సమాచారం తెలిసిన వెంటనే అక్కడికి చేరుకొని, బాధలో ఉన్న కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పడమే కాకుండా, అంత్యక్రియల బాధ్యతను దగ్గరుండి పర్యవేక్షించడం విశేషమన్నారు.

## అన్నమయ్య సంకీర్తనే సమాజానికి రక్ష

**: తిరుపతి శ్రీశక్తి పీఠం శ్రీ రామానంద భారతి స్వామి**



కార్యక్రమంలో పాల్గొన్న జస్టిస్ రాధారాణి, శ్రీశక్తి పీఠం శ్రీ రామానంద భారతి స్వామి, పద్మశ్రీ డాక్టర్ శోభారాజు తదితరులు

**చిక్కడపల్లి మే 2 ( ప్రభాతవార్త ) :**

అన్నమాచార్యుల సంకీర్తనలు కేవలం భక్తి మార్గానికే పరిమితం కాకుండా, సమాజ శ్రేయస్సుకు దిక్సూచిలా నిలుస్తాయని తిరుపతి శ్రీశక్తి పీఠం శ్రీ రామానంద భారతి స్వామి భక్తులకు దివ్య ఆశీస్సులు అందజేశారు. శనివారం అన్నమయ్య పదకోకిల, పద్మశ్రీ శోభారాజు ఆధ్వర్యంలో తొలి తెలుగు వాగ్గేయకారుడు అన్నమాచార్యులు వారి 618వ జయంతి సందర్భంగా అన్నమాచార్య భావనా వాహిని ఆధ్వర్యంలో అన్నమాచార్యుల విగ్రహం వద్ద విశ్వశాంతి సంకీర్తనాయజ్ఞం భక్తిభావంతో వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు చిక్కడపల్లి శ్రీ వెంకటేశ్వరా స్వామి ఆలయం నుండి మహా నగరసంకీర్తన జరిగింది. విశిష్ట అతిధిగా హాజరైన విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో శాంతిని పెంపొందించడానికి ఇటువంటి సంకీర్తనాయజ్ఞాలు ఎంతో అవసరమని అభివర్ణించారు. అన్నమయ్య సాహిత్యంలోని గొప్పతనాన్ని రాబోయే తరాలకు అందించడం అభినందనీయమన్నారు. చెన్నూరి సుబ్బారావు మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనా, మొక్కవోని దీక్షతో అన్నమాచార్య సంకీర్తనా ప్రచారాన్ని ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఏకైక వ్యక్తి శోభారాజు అని శ్లాఘించారు. తాడేపల్లి పతంజలి, కె. హనుమంతరావు, డాక్టర్ నందకుమార్, జి.రమణ తదితరులు పాల్గొన్నారు.

## పెట్టుబడి పేరిట మోసం...

**-ఇద్దరు స్కూల్ డైరెక్టర్లు అరెస్ట్**

**జూబ్లీహిల్స్, మే 2, ప్రభాతవార్త:** పెట్టుబడి పేరిట డబ్బులు తీసుకుని బోగస్ చెక్కులు ఇచ్చి మోసానికి పాల్పడిన ఇద్దరు స్కూల్ డైరెక్టర్లను బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. బంజారాహిల్స్ ఎస్ఐ విజయ్ కొట్టూర్ కథనం ప్రకారం... కమలాపురికాలనీలో బడ్స్ అండ్ ఫ్లవర్స్ పాఠశాల ఉంది. చనుబోయిన గోవింద్, ఆయన భార్య చనుబోయిన శ్రీదేవి డైరెక్టర్లుగా, కలిగెట్ల లక్ష్మీ ప్రసన్న అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గా ఉన్నారు. తమ పాఠశాలను బ్రాంచీలుగా విస్తరిస్తున్నామని, పెట్టుబడి పెడితే అధిక లాభాలిస్తామని గోవింద్, శ్రీదేవి చెప్పడంతో ఎస్ఎ స్ రెడ్డి అనే వ్యాపారి రూ.50 లక్షల పెట్టుబడి పెట్టాడు. లాభాల విషయమై వారు సమాధానం దాటవేస్తుండటంతో తన డబ్బులు తిరిగి ఇవ్వాలని పలుమార్లు వారిని కోరాడు. దీంతో వారు గత నెల మొదటివారంలో ఆయనకు ఆరు చెక్కులు ఇచ్చారు. వాటిని బ్యాంక్ డిపాజిట్ చేయడానికి వెళ్లగా అవి బ్లాక్ అయిన బ్యాంక్ అకౌంట్ చెక్కులని తేలింది. మోసపోయానని గ్రహించిన బాధితుడు గోవింద్, శ్రీదేవిలను కలవడానికి పలుమార్లు స్కూల్‌కు వెళ్లగా బౌన్సర్లతో అడ్డుకుని దాడులు చేయించారు. బంజారాహిల్స్ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్పై తెలిపారు.

## ఏటిఎంలో డబ్బులు దొంగిలించిన నిందితుల అరెస్ట్



నిందితులను పట్టుకున్న ముషీరాబాద్ పోలీసులు, ఏసీపీ రమేష్‌కుమార్

**ముషీరాబాద్, మే 2, ప్రభాతవార్త:** ఏటీఎం ద్వారా కస్టమర్ అకౌంట్ నుంచి డబ్బులు దొంగిలించిన ముగ్గురు నిందితులను ముషీరాబాద్ పోలీసులు సికింద్రాబాద్ జోన్ సిపి టాస్క్ ఫోర్స్ బృందంతో కలసి అరెస్ట్ చేశారు. ముషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుజరాత్‌కు చెందిన మహ్మద్ గుల్షామ్ (22), ముంబాయికి చెందిన మహ్మద్ రిజ్వాన్ (28), ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన ఆదిల్ అలీ (19)లు డ్రైవర్లుగా పనిచేస్తూ పలు కేసులలో నిందితులుగా ఉన్నారు. ఈ క్రమంలో గత నెల 23వ తేదీ ముషీరాబాద్ ఎస్‌బీఐ బ్రాంచ్ ఏటీఎంలో ఒక కస్టమర్ ఖాతా నుంచి గుర్తు తెలియని వ్యక్తులు ఏటీఎం ద్వారా డబ్బులు డ్రా చేశారు. కస్టమర్ బ్యాంకు మేనేజర్ దృష్టికి తీసుకురావటంతో బ్రాంచ్ మేనేజర్ శ్రీరామ చంద్రమూర్తి ముషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ముషీరాబాద్ పోలీసులు, సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించి, టాస్క్ ఫోర్స్ సిబ్బంది సాయంతో, శనివారం రాజా డీలక్స్ వద్ద నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి పలు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో దొంగిలించిన నగదుతో పాటు, దొంగతనానికి ఉపయోగించిన వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకుని, నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## విజయం అంకితభావాన్ని మరింత పెంచాలి

**: కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి. వివేకానంద్**

**కుత్బుల్లాపూర్, మే2 ప్రభాతవార్త**

విద్యార్థులు అంకితభావంతో కష్టించి సాధించిన విజయం భవిషత్ పట్ల అంకితభావాన్ని పెంపొందించేలా ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలని కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి.వివేకానంద్ సూచించారు. చింతల్ త్రివేణి హైస్కూల్ విద్యార్థులు ఇటీవల వెలువడిన పదవతరగతి ఫలితాలలో ఉత్తమమార్కులు సాధించిన సందర్భంగా వారిని అభినందించారు. త్రివేణి విద్యాసంస్థల ప్రతినిధులు సిఎస్‌ఓ సుబ్బారావు, సిఆర్‌ఓ వెంకట్‌రావు, చింతల్ బ్రాంచ్ ప్రిన్సిపల్ శివకీర్తన, అకాడమిక్ ఇంచార్జి చిన్నారావు, ఇంపాక్ట్ ఇంచార్జి వనిత, క్యాంపస్ ఇంచార్జి క్రాంతిల ఆధ్వర్యంలో చింతల్ బ్రాంచ్ విద్యార్థులు కలిసారు. ఈసందర్భంగా కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి.వివేకానంద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఏదైనా సాధించగలమనే పట్టుదల, అంకితభావాన్ని పెంపొందించడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహమే కాలకమన్నారు.



మంత్రికి వినతి పత్రం అందిస్తున్న పాస్టర్లు

### హుస్నాబాద్ మున్సిపాలిటీలో
## క్రిస్టియన్‌లకు ప్రాతినిధ్యం కల్పించాలి

**హుస్నాబాద్ రూరల్, మే 2, ప్రభాతవార్త :** హుస్నాబాద్ మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యులలో క్రిస్టియన్ మైనారిటీ నుంచి ఒకరికి అవకాశం కల్పించాలని కోరుతూ క్యాంపు కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పాస్టర్ల నియోజకవర్గ, మండల కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గత మున్సిపాలిటీ పాలకవర్గంలో మైనారిటీ కోఆప్షన్ సభ్యులలో క్రిస్టియన్ మైనారిటీకి ప్రాతినిధ్యం కల్పించారని, ప్రస్తుతం అదే విధంగా అవకాశం ఇవ్వాలని కోరారు. ముఖ్యంగా కోఆప్షన్ సభ్యురాలిగా ఖాతా గ్లోరీనా రత్నాకర్‌కు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు నియోజకవర్గ పాస్టర్ల కమిటీ అధ్యక్షుడు ఖాతా సల్మాన్‌రెడ్డి, మండల కమిటీ అధ్యక్షుడు పాస్టర్ ఇజ్రాయిల్ మంత్రిని కలిసి వివరించారు. దీనిపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి కౌన్సిలర్లతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. హుస్నాబాద్ పట్టణంలో క్రిస్టియన్ మైనారిటీ జనాభా గణనీయంగా ఉన్నందున వారికి సరైన ప్రాతినిధ్యం ఉండాలని, ఈ మేరకు కమిటీ తీర్మానం చేసి మంత్రికి అందజేసినట్లు పేర్కొన్నారు.

## తాటిచెట్లు నరికివేసినవారిపై చర్యలు తీసుకోవాలి



నరికిన తాటి చెట్లను పరిశీలిస్తున్న ఎక్సైజ్ అధికారులు

**హుస్నాబాద్ రూరల్, మే 2, ప్రభాతవార్త :** హుస్నాబాద్ మండలం పందిళ్ల గ్రామంలోని తాటి వనంలో బూట్ల కనకయ్య వ్యవసాయ భూముల్లో ఉన్న కల్లుపారే తాటి చెట్లను అర్ధరాత్రి సమయంలో అక్రమంగా నరికివేశారని గీత కార్మికులు ఆరోపించారు. ఈ విషయంలో ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేయగా వారు ఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. తాటి చెట్ల నరికివేతతో తమ ఉపాధి కోల్పోయామని గీత కార్మికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే స్పందించి సంబంధిత వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకుని కేసు నమోదు చేయాలని, బాధిత గీత కార్మికులకు న్యాయం చేయాలని ప్రభుత్వం, ఎక్సైజ్ అధికారులను గీత కార్మికుల పక్షాన పందిళ్ల గౌడ సంఘం అధ్యక్షుడు బొమ్మగాని ప్రశాంత్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ రాష్ట్ర అధ్యక్షులు మార్క అనిల్ గౌడ్, గ్రామ సర్పంచ్ తోడేటి రమేష్, ఉప సర్పంచ్ పెండ్యాల సంపత్ రెడ్డి, గ్రామ గీత కార్మికులు పాల్గొన్నారు.

## స్వామి వారిని దర్శించుకున్న న్యాయమూర్తి



న్యాయమూర్తిని సన్మానిస్తున్న దృశ్యం

**కొమురవెల్లి, మే 2, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామిని చేర్యాల జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు బదిలీపై వచ్చిన జూనియర్ సివిల్ జడ్జి శ్రీ శ్రీరామ్ కుటుంబీకులతో కలిసి శనివారం స్వామివారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అధికారులు జడ్జిని ఘనంగా సత్కారించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, పర్యవేక్షకులు నీల చంద్రశేఖర్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడికి సత్కారం



లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న నాయకులు

**సిద్దిపేట అర్బన్, మే 2, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా ఎన్నికైన అమరావది లక్ష్మీనారాయణ ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా హైదారాబాద్ వనస్థలిపురం జీఎస్ఆర్ కన్వెన్షన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్రకార్యదర్శి గంప శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు అయిత రత్నాకర్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి వివేక్‌వెంకటస్వామి, మాజీ ఎంపి టీజీ వెంకటేష్, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి తదితరులు కార్యక్రమానికి హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో డా॥మాంకాల నవీన్‌కుమార్, పుల్లూరి శివకుమార్, గంప కృష్ణమూర్తి, అరవపల్లి హరికిరణ్, శ్రీనివాస్, నారాయణ పాల్గొన్నారు.

## 10లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సన్మానం

**నర్సాపూర్, మే 2, ప్రభాతవార్త :** పదవ తరగతిలో ప్రతిభ కనబరిచి అత్యధిక ర్యాంకులు సాధించిన విద్యార్థులను శుక్రవారం నర్సాపూర్ మండల పరిధిలోని చిన్న చింతకుంట గ్రామ సర్పంచ్ ప్యాట సరిత మహేష్ శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సరిత మహేష్ మాట్లాడుతూ ఇదే పట్టుదలతో నూతన ఉత్సాహంతో పట్టుదలతో చదివి మంచి ఉద్యోగాలు పొంది జీవితంలో ఉన్నత స్థాయికి. ఈ మేరకు మీ తల్లిదండ్రులు కన్న కలలను సాకారం చేసి వారికి తోడునీడగా ఉండి సహకారం అందించాలని, విద్యార్థులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని సర్పంచ్ సరితా మహేష్ విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, ఉప సర్పంచ్ వజ్జె పెంటయ్య, వార్డు సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు



విద్యార్థులకు సన్మానం చేస్తున్న సర్పంచ్ సరిత మహేష్ తదితరులు

# ఆధ్యాత్మికతకు...అన్నదానాలకు పెట్టింది పేరు సిద్దిపేట

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు



మాట్లాడుతున్న హరీష్‌రావు

**సిద్ధిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
ఆధ్యాత్మికతకు...అన్నదానాలకు పెట్టింది పేరు సిద్దిపేట అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని 3వ వార్డు రంగధాంపల్లిలో శ్రీపంచవటి హనుమాన్ దేవాలయంలో నిర్మించిన అన్న ప్రసాద భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. హనుమాన్ దీక్షకు..బిక్షకు బీజం వేసింది సిద్దిపేటనేని తెలిపారు. రావిచెట్టు హనుమాన్ దేవాలయంలో 41 రోజులు, గణేష్‌నగర్ హనుమాన్‌దేవాలయంలో 21 రోజులు, పంచముఖ హనుమాన్ దేవాలయంలో 21 రోజులు బిక్ష కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎన్నో కార్యక్రమాలకు సిద్దిపేట నెలవుగా మారిందన్నారు.

**హనుమాన్ సిద్ది యాగం జరగడం సంతోషం**

ఎక్కడైతే హనుమంతుడిని స్మరిస్తామో అక్కడ ఆధ్యాత్మిక భావనతో పాటు మనో ధైర్యం కొండంత భరోసా వికసిస్తుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జరుగుతున్న భవిష్యత్ బ్రహ్మ హనుమాన్ సిద్ది మహా యాగం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హనుమాన్ పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామి వారి ఆధ్వర్యంలో సిద్దిపేటలో ఈ యాగం జరగడం సంతోషంగా ఉందన్నారు. ఈ యాగంలో సుందర కాండ యజ్ఞం, 1400 సార్లు 72 గంటలు అఖండ హనుమాన్ చాలీసా పారాయణం జరుగుతుందన్నారు. హనుమతునికి ఇష్టమైన తేనె, తమల పాకులు, పాలుతో అభిషేకం కార్యక్రమాలు జరిగాయన్నారు. శత్రు నివారణకు నేడు లక్ష సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేయడం గొప్ప విశేషమన్నారు. దేశంలోనే అత్యధికంగా హనుమాన్ మాలధారణ చేసే భక్తులు ఎక్కడ ఉన్నారంటే సిద్దిపేటలోనేనని తెలిపారు. హనుమాత్ స్వరూపుడిగా కనిపించే దుర్గాప్రసాద్ స్వామీజీ చేతుల మీదగా మాలధారణ చేసుకోవడం సిద్దిపేట భక్తుల అదృష్టమన్నారు. ఆయా కార్యక్రమాలలో హనుమాన్ మాలధారులు బిఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

## రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

**కొల్చారం, మే 2 (ప్రభాతవార్త):** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని కొల్చారం మండలం చిన్నగణపురం గ్రామంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ కె.సురేష్ రైతులకు వివిధ పంటల్లో తీసుకోవాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులపై వివరించారు. ముఖ్యంగా వరిలో సమగ్ర పోషక యాజమాన్యం, నీటి యాజమాన్యం గురించి సూచనలు ఇచ్చారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం అభివృద్ధి చేసిన సన్న రకాలైనవంటి విత్తనాలను సాగు చేయాలని రైతులకు సూచించారు. అలాగే మట్టి పరీక్షలవల్ల కలిగే ప్రయోజనాలు, వివిధ పంటల్లో వచ్చే చీడపీడల నివారణ చర్యలు వివరించారు. పంట మార్పిడి విధానాన్ని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. వ్యవసాయ కళాశాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ హారిక మాట్లాడుతూ వరికి ప్రత్యామ్నాయంగా టమాటా, మిరప, పుచ్చకాయ, ఫామ్ ఆయిల్, వేసవికాలంలో ఆకుకూరల సాగు ద్వారా తక్కువ సమయంలో అధిక దిగుబడి, అధిక ఆదాయం పొందవచ్చన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారి రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ వరి కోయలు కాల్చడం వల్ల భూసార నష్టం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రైతులు, గ్రామ పెద్దలు, శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

**ఎం.జలాల్పూర్‌లో...**

**వెల్దుర్తి, మే 2, ప్రభాతవార్త :** మండలంలోని ఎం జలాల్పూర్ గ్రామ పంచాయతీలో శనివారం రైతు ముంగిట్లో కార్యక్రమాన్ని శాస్త్రవేత్తలు. నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పచ్చి రొట్టె పంటల ద్వారా యూరియాసక్రమ వినియోగం, పంటల వైవిధ్యీకరణ, పురుగు మందుల హానికర ప్రభావాలు, వరి, విత్తన శుద్ధి, వేప, ఆధారిత స్ప్రేలు, డ్రిప్ సాగు ద్వారా నీటి సంరక్షణ, డ్రం లీడర్ విధానం, సేంద్రియ వ్యవసాయం ప్రాముఖ్యత అంశాలపై రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పి జె టి ఏ యు అధ్యాపకులు డాక్టర్ బి సవిత. ప్రొఫెసర్. డాక్టర్ ఎం ప్రమీల. పాల్గొన్నారు ఏయూ చంద్రవేణి. వ్యవసాయ శాఖ సిబ్బంది. గ్రామ రైతులు పాల్గొన్నారు.

**బొబ్బిలిగావ్‌లో...**

**సదాశివపేట, మే 2 ప్రభాతవార్త :** మండల పరిధిలోని బొబ్బిలిగావ్ గ్రామంలో శనివారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలకు చెందిన అగ్రోనమీ విభాగం శాస్త్రవేత్త డా. పి.రేవతి, వ్యవసాయ విస్తరణ విభాగానికి చెందిన డా. కె.రాకేష్ పాల్గొన్నారు. అలాగే వ్యవసాయ విస్తరణ అధికారి ఎన్.ప్రకాశ్, సర్పంచ్ ఎస్.ఉమాదేవి, ఉపసర్పంచ్ జి. విజయేందర్, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. డా. పి. రేవతి 6 అజెండా అంశాలపై స్పష్టంగా, విపులంగా రైతులకు అవగాహన కల్పించారు. తక్కువ యూరియా వినియోగం, సాగు ఖర్చులు తగ్గించడం, పంట మార్పిడి, మార్కెట్‌కు అనుగుణంగా పంటల ఎంపిక, సహజ వనరుల సంరక్షణ వంటి అంశాలను వివరించారు.

## చెక్కులను పంపిణీ చేస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్

**కీసర, మే 2 ప్రభాతవార్త :** పేదలకు కళ్యాణలక్ష్మీ ఒక వరంలాంటిదని ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం ప్రజాపాలన–ప్రగతిప్రణాళికలో భాగం గా మేడ్చల్ నియోజకవర్గస్థాయి సమావేశాన్ని కీసరలోని కెబిఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఆర్‌డిఓ రాజేష్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమం లో మేడ్చల్ నియోజకవర్గ వివిధగ్రామాలకు చెందిన అర్హులైన 384మందికి కళ్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని ప్రధానంగా తీసుకుని అమలుచేస్తున్న పథకాలు పేదకుటుంబాలకు ఎంతో అండగా నిలుస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మార్కెట కమిటీ చైర్మన్ నర సింహ్మాయాదవ్, ఆర్‌టిఏ మెంబర్ జైపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ శిరీష, వివిధ మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.



'వార్త' సిఎండి గిరీష్‌కుమార్‌సంఘీని సత్కరిస్తున్న ఆర్యవైశ్య మహాసభ నేతలు

## 'వార్త' సిఎండి గిరీష్‌కుమార్ సంఘీకి ఘన సత్కారం

**సిద్దిపేట అర్బన్, మే 2, ప్రభాతవార్త :** రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన అమరావది లక్ష్మీనారాయణ ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా హైదారాబాద్ వనస్థలిపురం జీఎస్ఆర్ కన్వెన్షన్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న వార్త సిఎండి, మాజీ రాజ్యసభ సభ్యులు, జాతీయ వైశ్య ఫెడరేషన్ అధ్యక్షులు గిరీష్‌కుమార్ సంఘీని సిద్దిపేట ఆర్య వైశ్య మహాసభ ప్రతినిధులు పుల్లూరు శివకుమార్, డా॥మాంకాల నవీన్ కుమార్, అరవపల్లి హరికిరణ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కారించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మున్సిపల్ వైస్‌చైర్మన్‌కు, కౌన్సిలర్‌కు సన్మానం

**శామీర్‌పేట, మే 2 ప్రభాతవార్త :** ఇటీవల జరిగిన అలియాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొందిన వైస్‌చైర్మన్ కె.మాలతిమాధవరెడ్డిని, కౌన్సిలర్ దీపికవరప్రసాద్‌రెడ్డిలను తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్(ట్రస్మా) ఘనంగా సత్కరించారు. శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో తుర్కపల్లిలోని సెంట్ మేరిస్ హైస్కూల్ కరస్పాండెంట్ 4వవార్డు కౌన్సిలర్‌గా దీపికవరప్రసాద్‌రెడ్డి, లాల్‌గడి మలక్ పేట్‌లోని సరస్వతి విద్యానికేతన్ హైస్కూల్ కరస్పాండెంట్ 5వ వార్డు కౌన్సిలర్‌గా కె.మాలతిమాదవరెడ్డి(వైస్‌చైర్మన్‌గా) ఎన్నికకావటంతో మర్యాదపూర్వకంగా వారిని ట్రస్మా నుంచి రాష్ట్ర ఉపాధ్యక్షులు గోనె హనుమంతరెడ్డి ఘనంగా సన్మానించి అభినందించారు. శామీర్‌పేట మండల ప్రైవేట్ స్కూల్స్ ట్రెజరర్ దివ్యజ్యోతి ఆధ్వర్యంలో పలువురు ప్రైవేట్‌స్కూల్స్ యాజమాన్యాల కరస్పాండెంట్స్ పాల్గొని సన్మానించి అభినందనలు తెలియజేశారు. ప్రైవేట్ స్కూల్స్ కరస్పాండెంట్స్ ప్రజాప్రతినిధులుగా ఎన్నికకావటం అభినందనీయమని రాష్ట్ర ఉపాధ్యక్షులు గోనె హనుమంతరెడ్డి అన్నారు. కార్యక్రమంలో ట్రస్మాసభ్యులు శివశంకర్, పంచాక్షరి, సూరజ్, వై.వరప్రసాద్‌రెడ్డి, కె.మాదవరెడ్డి, శామీర్‌పేట మండలంలోని వివిధ పాఠశాలల కరస్పాండెంట్స్ వారిని అభినందించారు.

## శ్రద్ధతో చదివితే ఉన్నత ఫలితాలు

**జిల్లెడు చౌదరిగూడ, మే 2, ప్రభాతవార్త:**
విద్యార్థులు శ్రద్ధతో చదివితే ఉన్నత ఫలితాలు సాధించవచ్చని చౌదరిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత అన్నారు. శనివారం పాఠశాలలో పదవతరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు శాలువా లతో సన్మానకార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, మండల టాపర్‌లుగా తమ విద్యార్థులు నిలవడం ఎంతో సంతోషకరమని ఆమె పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులను సర్పంచ్ శ్వేతచంద్రబాబుగౌడ్, ఉపసర్పంచ్ అజ్బు, ఎజాజ్‌ఆలీ, దామోదర్, పాఠశాల చైర్మన్ లక్ష్మీలు విద్యార్థులను సన్మానించినట్లు తెలిపారు.

## వైభవంగా తిరుమలనాథస్వామి ఉత్సవాలు

**పూడూరు, మే 2 ప్రభాతవార్త :** మండలం పరిధిలోని రాకంచెర్లలో తిరుమలనాథ స్వామి(యోగానంద లక్ష్మీనర్సింహస్వామి)వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవరోజు శుక్రవారంరాత్రి శ్రీతిరుమలనాథ స్వామివారి కళ్యాణం, రథోత్సవం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన భక్తులు భారీసంఖ్యలో పాల్గొని బాజాభజంత్రీల మధ్య శ్రీస్వామివారి రథాన్ని లాగేందుకు పోటీ పడ్డారు. ఊరేగింపుగా వెళ్లే రథానికి భక్తులు దండలు వేస్తూ, గుమ్మడికాయలు, కొబ్బరికాయలు కొడుతూ స్వాగ తం పలికారు. ఈ సందర్భంగా శ్రీయోగానంద లక్ష్మీనర్సింహ్మ స్వామివారి కళ్యాణంలో ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి పాల్గొని, స్వామివారిని దర్శించు కొని ప్రత్యేకపూజలు చేశారు. ఈసందర్భంగా వివిధగ్రామాల భజన మండలు లు పాల్గొని శ్రీరాకంచెర్ల వెంకటదాసులవారి సంకీర్తనలను ఆలపించారు. దీంతో గ్రామమంతా శ్రీలక్ష్మీనర్సింహ్మస్వామియేనమః నామస్మరణతో మార్మోగింది. శనివారంరాత్రి శ్రీస్వామివారి దీపోత్సవం, సహస్ర పుష్పార్చన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు.

# అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాలి

### మెదక్ జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి



సమావేశంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు

**నర్సాపూర్, మే 2, ప్రభాతవార్త :** అధికారులు ప్రభుత్వ సంక్షేమపథకాలను ప్రతి అర్హుడికి అందేలా చర్యలు తీసుకోవాలని మెదక్ జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ చిలుముల సుహాసినిరెడ్డి అన్నారు. శనివారం ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా నర్సాపూర్ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని వైపర్ ఫార్మా కాలేజ్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి హాజరై మాట్లాడుతూ ప్రజల సమస్యలను సమర్ధవంతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ లక్ష్మీరాజుయాదవ్ మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారంలో స్థానిక సంస్థల పాత్ర కీలకమని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంచేయడానికి ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్‌డిఏ పిడి శ్రీనివాసరావు, ఆర్డీవో రామకృష్ణ ఇతర ఉన్నతాధికారులు పాల్గొని అభిప్రాయాలను వెల్లడించారు. వివిధ శాఖల అధికారులు తమ పరిధిలో అమలవుతున్న పథకాల పురోగతిని వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు శాఖ తరఫున తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ పాల్గొని మాట్లాడుతూ ప్రజలకు రహదారి భద్రతపై ముఖ్య సూచనలు అందించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాల్సిన అవసరాన్ని వివరించి, ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు. ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని కోరారు. సమావేశంలో నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలోని మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఉపసర్పంచులు, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వ్యవసాయ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పాలన అధికారులు పాల్గొన్నారు.

## 5న ఉత్తమ విద్యార్థులకు పురస్కారాల అందజేత

**మిరుదొడ్డి, మే 2, ప్రభాతవార్త :** మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదివి ఇటీవల జరిగిన పరీక్షల్లో 500కుపైగా మార్కులు సాధించిన ఉత్తమ విద్యార్థులకు విద్యా పురస్కారాలను ఈనెల 5న ఉదయం 9 గంటలు నిర్వహించడం జరుగుతుందని ప్రభుత్వ విద్యా పరిరక్షణ వేదిక సభ్యులు, నిర్వాహకులు పెద్ది రాజు, తుమ్మల బాలరాజు, అందె రాంచంద్రం, అందె ప్రవీణ్, మొగుళ్ల ఐలయ్య, దశరథం, శ్రీనివాస్, కనక రాజు, స్వామి, నరేష్‌కుమార్, లచ్చయ్య, ప్రశాంత్, మల్లేశంలు తెలపారు. మిరుదొడ్డిలోని రామాలయం కళ్యాణ మండపంలో ప్రభుత్వ విద్యా పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి ఎంపి రఘునందన్‌రావు, ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, డిఈవో శ్రీనివాస్‌రెడ్డి, మండల విద్యాధికారి ప్రవీణ్‌బాబు తదితరులు పాల్గొంటారని తెలిపారు.

## ఎండ తీవ్రత... కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలి

### సర్పంచ్ సునీత రాజు నాయక్

**అక్కన్నపేట, మే 2,ప్రభాతవార్త :** మండలంలోని సేవాలాల్ మహారాజన తండా గ్రామంలో ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ఉపాధి హామీ కూలీలకు గ్రామ సర్పంచ్ జరుపుల సునీత రాజు నాయక్ మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఉపాధి హామీ కూలీలతో పాటు ఐకెపి సెంటర్లో ఉన్న హమాలీ కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండ తీవ్రత దృష్ట్యా కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏదైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే ఫీల్డ్ అసిస్టెంట్‌కు తెలియజేయాలన్నారు. అత్యవసరం ఉంటే తప్ప ఎండలో బయటకు రావొద్దన్నారు. సర్పంచ్ మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయడం పట్ల కూలీలు, హమాలీలు కృతజ్ఞతలు తెలిపారు.

## పంచాయతీ కార్మికుడిపై దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

**అక్కన్నపేట, మే 2,ప్రభాతవార్త :** మండల పరిధిలోని రామవరం గ్రామ పంచాయతీ కార్మికుడు బోనగిరి శ్రీనివాస్‌పై దాడి చేసిన నర్సయ్యపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్(సిఐటియూ) జిల్లా ఉపాధ్యక్షులు వేముగంటి సాయిలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన శనివారం మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కార్మిక వర్గం మే డే వేడుకలు జరుపుకుంటున్న రోజే రామవరం గ్రామంలో ఇలాంటి దుర్మార్గమైన సంఘటన జరగడం సరికాదన్నారు. పంచాయతీ కార్మికున్ని చెప్పుతో కొట్టడం తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. నర్సయ్యపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఎండాకాలంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

**సిద్దిపేట అర్బన్, మే 2, ప్రభాతవార్త :** వేసవి ఎండలు రోజు రోజూకు పెరుగుతుండడంతో ఎండ తీవ్రతతో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రముఖ కార్డియాలజీ డాక్టర్ అనంద్ రాజ్ తెలిపారు. ఇట్ స్ట్రోక్ గుండెకు ప్రమాదం తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే అంశంపై శనివారం జిల్లా కేంద్రంలోని ఆవిష్ఠ ఆసుపత్రిలో అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. వేసవి ఎండలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున్న గుండె వ్యాధులు, బిపి, షుగర్ వంటి వ్యాధులు ఉన్న వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శరీరం పూర్తిగా డిహైడ్రేషన్‌కు గురైతే హీట్ స్ట్రోక్ వచ్చి తద్వారా గుండె, కిడ్నీ సమస్యలు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఉదయం, సాయంత్రం మాత్రమే పనులు చేసుకోవాలన్నారు. హిట్ స్ట్రోక్ వచ్చిన వారిని వెంటనే చల్లని ప్రదేశానికి తీసుకెళ్లాలన్నారు. ఎండ కాలంలో ఏవైనా సమస్యలు ఉంటే అత్యవసర సేవలు అందిస్తామన్నారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం.. మానసిక ప్రశాంతత

### మున్సిపల్ చైర్మన్ మనుచూరి లక్ష్మీరాజుయాదవ్

**నర్సాపూర్, మే 2, ప్రభాతవార్త :** ప్రతిరోజు యోగా చేయడంతో మనిషికి సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత చేకూరుతుందని నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మనుచూరి లక్ష్మీరాజుయాదవ్ అన్నారు. శనివారం బుద్ధపౌర్ణమిని పురస్కరించుకొని లక్ష్మీ పిరమిడ్ యోగ కేంద్రం ఆధ్వర్యంలో యోగపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ లక్ష్మీరాజుయాదవ్ హాజరై మాట్లాడుతూ ప్రతినిత్యం యోగా సాధన చేయడం ద్వారా మానసిక ప్రశాంతత లభించడమే కాకుండా మనిషి ఆరోగ్యంగా ఉంటారన్నారు. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఒత్తిడిని తగ్గించుకోవడానికి యోగ సాధన ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరు ప్రతిరోజు యోగ ధ్యానం చేయడం ద్వారా సానుకూలమైన మంచి ఆలోచనలు కలుగుతాయన్నారు. బుద్ధుడు సూచించిన శాంతి ఆత్మస్థైర్యం వంటి విలువలు గల జీవితం యోగ సాధనద్వారా లభిస్తుందని తెలిపారు. యువకులతోపాటు ప్రతి ఒక్కరి యోగాను అలవాటు చేసుకుని ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని యువతకు ఆమె సూచించారు. కార్యక్రమంలో లక్ష్మీపిరమిడ్ యోగా కేంద్రం నిర్వాహకులు, స్థానిక ప్రజలు, యోగ సాధకులు పాల్గొన్నారు.

## వందశాతం ఉత్తీర్ణతకు కృషీవలుడు

**మోమిన్‌పేట్, మే 2 ప్రభాతవార్త :** 2018–19వ, సంవత్సరం నుండి 2025–26 వరకు వరుసగా పదవ తరగతి విద్యార్థులు వందకు వంద శాతం ఉత్తీర్ణులుకావడంతో ఉపాధ్యాయుడు సమ్మయ్య సంతోషంతో విద్యార్థినీ విద్యార్థులకు తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. అప్పట్లో ఉపాధ్యాయుడు సమ్మయ్య జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా జిల్లా విద్యా శాఖాధికారి రేణుకాదేవి ఆధ్వర్యంలో, జిల్లా కలెక్టర్, శాసనసభ్యులు, ఉపాధ్యాయసంఘాల సమక్షంలో జిల్లా కేంద్రంలో ఉత్తమ అవార్డు, మొమెంటో అందజేసి శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ప్రస్తుతం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల(బాలుర) మోమిన్ పేట్‌లో భౌతికశాస్త్రం బోధకుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరంలో పదవ తరగతిలో 34మంది విద్యార్థులకుగాను 100% (34మంది) విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. అందులో 100కు 100మార్కులు భౌతిక శాస్త్రంలో సాధించడం గర్వంగా ఉందని ఉపాధ్యాయుడు సమ్మయ్య అన్నా రు. ఉపాధ్యాయుడు సమ్మయ్య కృషికి ఉపాధ్యాయులు తదితరులు ధన్యవాదాలు తెలిపారు.

## నీటి సమస్యను పరిష్కరించిన సర్పంచ్

**కేశంపేట, మే 2 ప్రభాతవార్త :** మండల పరిధిలోని సంగెం గ్రామంలో 7వ వార్డులో కొంతకాలంగా నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న కాలనీ వాసులు, కాలనీలో ఉన్నటువంటి నీటి సమస్యను గ్రహించిన సర్పంచ్ కాలనీవాసులకు సమస్య పరిష్కరించేందుకు శనివారం సర్పంచ్ వేణుగోపాలాచారి బోరుమోటర్ మరమ్మతు పనులను ప్రారంభించారు. దీంతో ఏడవ వార్డులో నెలకొన్న నీటి సమస్య పరిష్కారం అవుతుందని ఆయన ఆశా భావం వ్యక్తంచేశారు. ప్రజాసేవే ధ్యేయంగా గ్రామంలోని సమస్యల పరిష్కా రానికి ముందుండి చర్యలు తీసుకుంటున్న సర్పంచ్ వేణుగోపాలచారిని గ్రామస్థులు అభినందిస్తున్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు సయ్యద్ సలీం, సువర్ణరామచంద్రయ్య, కాలనీవాసులు, పాల్గొన్నారు.

## కోఆప్షన్ మెంబర్లను ఎన్నుకున్న కాంగ్రెస్ కౌన్సిలర్లు

**పరిగి, మే 2 ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా, పరిగి మున్సిపాలిటీలో నలుగురిని కోఆప్షన్ సభ్యులుగా కాంగ్రెస్‌పార్టీ కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మైనార్టీ నుంచి అక్బర్ హుస్సేన్, క్రిస్టియన్ మైనారిటీ నుంచి కమల ఆనంద్, ఎక్స్ అఫిషియో (జెనరల్) నుంచి ఆనం ఆంజనేయులు, ఎక్స్ అఫిషియో సీనియర్ సిటిజన్ నుంచి ఫిరంగి పద్మలను కోఆప్షన్ సభ్యులుగా శనివారం పురపాలక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎక్స్ అఫీషియో సభ్యులుగా సమావేశానికి హాజరైన పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్‌రెడ్డి, నూతనంగా ఎన్నికైన కోఆప్షన్ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. మున్సిపల్ అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించాలని, పట్టణ అభివృద్ధికి సలహాలను అందించాలని కో ఆప్షన్ సభ్యులకు తెలియజేశారు.. రాబోయే రోజుల్లో పరిగి మున్సిపల్ పరిధిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ రజిత వెంకటేష్, వైస్‌చైర్మన్ కమల్ పాల్గొన్నారు.

## ఆంజనేయస్వామి దేవాలయం పునఃప్రతిష్ఠ

**తలకొండపల్లి, మే 2 ప్రభాతవార్త :** మండల పరిధిలోని చౌదర్పల్లి గ్రామంలో నూతనంగా ఆంజనే యస్వామి దేవాలయం పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలో గత రెండురోజులుగా నిర్వహిస్తున్న కార్యక్రమానికి గ్రామంలోని ప్రజలందరూ పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. శనివారం నిర్వహించిన, దేవాలయం ప్రాంగణంలో నిర్వహించిన మహా సుదర్శన యాగాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కోలాహలంగా భక్తికి సంబంధించిన తదితర కార్య క్రమాలతో గ్రామం మారుమోగింది. ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నందున భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలనే సర్పంచ్ భారతమ్మ తెలిపారు.



బిజెపి రాష్ట్ర అధ్యక్షుడికి వినతిపత్రం సమర్పిస్తున్న అశ్విని శ్రీనివాస్

## రామాయంపేటలో రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేయాలి

**రామాయంపేట, మే 2, ప్రభాతవార్త :** రామాయంపేటకు విచ్చేసిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు, ఎంపి ఎం. రఘునందన్‌రావులను రామాయంపేట రెవెన్యూ డివిజన్ ఉద్యమ నేత పోచమ్మల అశ్విని‌శ్రీనివాస్ కలిసి రామాయంపేట రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఏర్పాటు, అలాగే నియోజకవర్గ కేంద్రంగా పునరుద్ధరణకు సంబంధించిన సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు మెదక్ కలెక్టరేట్ ప్రారంభోత్సవ సభలో రామాయంపేటను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించినప్పటికీ, ఇప్పటివరకు ఆర్డీవో కార్యాలయం పూర్తి స్థాయిలో పనిచేయడంలేదని పేర్కొన్నారు. ఆర్డీవోతోపాటు అవసరమైన సిబ్బంది లేకపోవడంతో సాధారణ రెవెన్యూ పనులకోసం ప్రజలు మెదక్‌కు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రామాయంపేట అభివృద్ధి దిశగా ముందుకు సాగాలంటే తక్షణమే ఆర్డీవోను నియమించి, పూర్తిస్థాయి రెవెన్యూ డివిజన్ కార్యాలయాన్ని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న నియోజకవర్గాల పునర్విభజనలో గతంలో కోల్పోయిన రామాయంపేటను తిరిగి నియోజకవర్గ కేంద్రంగా ఏర్పాటు చేసి ప్రాంత అభివృద్ధికి దోహదం చేయాలని కోరారు.

## చౌటకూరులో జనగణనపై శిక్షణ ప్రారంభం



జనగణనపై శిక్షణ పొందుతున్న సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లు

**చౌటకూరు, మే 2, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో జనగణన-2027 లో భాగంగా సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లకు శిక్షణ కార్యక్రమం శనివారం ప్రారంభించారు. తహసీల్దార్ ఎన్.కిష్టయ్య శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లలకు పలు సూచనలు చేశారు. జనగణన ప్రక్రియ దేశ అభివృద్ధికి కీలకమన్నారు. సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లు తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించాలన్నారు. శిక్షణలో ప్రతి అంశాన్ని జాగ్రత్తగా అర్థం చేసుకుని క్షేత్ర స్థాయిలో ఎలాంటి తప్పిదాలు లేకుండా డేటా సేకరణ చేయాలన్నారు. సరైన సమాచారం సేకరణతో ప్రభుత్వానికి ప్రజల అవసరలు, సమస్యలు స్పష్టంగా తెలిసి అభివృద్ధి కార్యక్రమాలకు రూపకల్పన చేయడం సులభమవుతుందన్నారు. ఫీల్డ్ ట్రైనర్లు గోపికృష్ణ, లక్ష్మీనారాయణలు సూపర్‌వైజర్లకు, ఎన్యూమరేటర్లకు ప్రాక్టికల్ విధానాలు, ఫార్మాట్ నింపి విధానం డేటా నమోదు పద్ధతులపై సమగ్రంగా శిక్షణ అందించారు. శిక్షణలో ఆధునిక సాంకేతిక పద్ధతులు, మొబైల్ యాప్ వినియోగం, గణనలో ఎదురయ్యే సమస్యలు,పరిష్కారర మార్గాలపై వివరించారు.

## వైభవంగా మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలు



మల్లికార్జున స్వామి జాతరలో ఎడ్ల బండ్లు తిరుగుతున్న దృశ్యం

**అల్లాదుర్గం, మే 2, ప్రభాతవార్త:** మండల పరిధిలోని గడిపెద్దాపూర్‌లో మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం జాతర ప్రధాన ఘట్టమైన ఎడ్ల బండ్ల ప్రదక్షిణ భక్తులను ఆకట్టుకుంది. అందంగా అలంకరించిన ఎడ్ల బండ్ల ప్రదక్షిణ ముందు యువకులు కేరితలు వేస్తూ చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ప్రతి ఎడ్లబండి ముందు డోలు వాయిద్యాలు, డప్పు చప్పుళు, శివసత్తుల నృత్యాలు, పోతారాజుల విన్యాసాలు జాతరకు హైలెట్‌గా నిలిచాయి. జాతర ఉత్సవాలను తిలకించేందుకు గడిపెద్దాపూర్ గ్రామస్థులతోపాటు పరిసరగ్రామాలైన ముస్లాపూర్, దాదాయపల్లి, బర్దిపూర్, బహిరన్‌దిబ్బ, పోతుల బొగుడ, బిజిలిపూర్, కేరూర్, రంసానిపల్లి, ఎర్రారం తదితర నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని స్వామి వారిని దర్శించుకుని పూజలు (స్వామివారికి ఒడిబియ్యం, కుంకుమార్చన తదితర) నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. జాతర ఉత్సవాలు ప్రశాంతంగా ముగిసేలా అల్లాదుర్గం సిఐ రేణుకరెడ్డి, ఎస్ఐ శంకర్ ఆధ్వర్యంలో బందోబస్తును నిర్వహించారు.

## మెథడిస్ట్ క్రైస్తవ జాతరను ప్రారంభించిన ఎమ్మెల్యే



మెథడిస్ట్ క్రైస్తవ జాతరను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాణిక్యారావు

**జహీరాబాద్ మే 2 ప్రభాతవార్త :** పట్టణంలోని గార్డెన్‌నగర్, ఆల్లిపూర్ రెవ. జి బి గార్డెన్ మెమోరియల్ మెథడిస్ట్ సెంట్రల్ చర్చ్‌లో నిర్వహిస్తున్న మెథడిస్ట్ 96వ క్రైస్తవ జాతరను శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే మాణిక్యరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 96 సంవత్సరాలుగా ఈ జాతర నిర్వహించడం జరుగుతుంన్నారు. ఈ కార్యక్రమంలో ఝరాసంఘం మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం, అల్లిపూర్ కౌన్సిలర్‌లు దీపక్, విజయరాజు, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు శివప్ప పాస్టర్లు, నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ టీచర్లకు స్మార్ట్‌ఫోన్లు పంపిణీ...

**జహీరాబాద్, మే 2(ప్రభాతవార్త):** అంగన్‌వాడీ టీచర్లకు ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు శుక్రవారం క్యాంపు కార్యాలయంలో స్మార్ట్‌ఫోన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామస్థాయిలో సేవలందిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది పనితీరు మరింత సమర్థవంతంగా, వేగవంతంగా ప్రజలకు చేరేందుకు ఈ డిజిటల్ సదుపాయం ఉపయోగపడుతుందన్నారు. చిన్నారుల ఆరోగ్యం, పోషణ, గర్భిణీ స్త్రీల సంక్షేమం వంటి అంశాల్లో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ సుశీల, పార్టీ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ, ఝరాసంఘం మండల అధ్యక్షుడు వెంకటేశం, మొగుడంపల్లి మండల అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి, కోహీర్ మండల అధ్యక్షుడు నర్సింలు, మాజీ మున్సిపల్ చైర్మన్ తంజిం, పట్టణ మాజీ అధ్యక్షుడు యాకూబ్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బండి మోహన్, వైస్ చైర్మన్ శిరీష సురేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు అబ్దుల్లా, గౌస్ గౌరీ, జాకీర్, దీపక్, విశ్వేశ్వర్, ప్రవీణ్, నాయకులు అక్బర్, ఫయాజ్, సీనియర్ అసిస్టెంట్ ప్రదీప్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# సింగూరు ప్రాజెక్టు అభివృద్ధికి రూ. 8.14 కోట్లు మంజూరు

### -పరిపాలన ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**పుల్‌కల్, మే 3, ప్రభాతవార్త:** మండలంలోని ఎం బాగారెడ్డి సింగూరు ప్రాజెక్టు అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రాజెక్టులో మౌలిక వసతుల కల్పనకు 8.14 కోట్ల రూపాయల నిధులను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కార్యదర్శి శ్రీధర్ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రాజెక్టు రేడియల్ క్రస్ట్ గేట్లు హోయిస్ట్ పరికరాలు, స్టాప్ లాగ్ ఎలిమెంట్స్, గ్యాంట్రీ క్రేన్‌లను పేయింటింగ్‌లతో పాటు నిర్వహణ పనులకు పరిపాలన అనుమతి ఇస్తూ జీఓఆర్‌టీ 190 ద్వారా ఉత్తర్వులు విడుదల చేసింది. ప్రాజెక్టుకు తక్షన మరమ్మత్తులు అవసరమని అందుకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఇంజనీర్ ఇన్ ఛీఫ్ గతంలో ప్రభుత్వానికి పలు ప్రతిపాదనలతోకూడిన నివేదిక పంపారు. ఇంజనీరర్ ఇన్ చీఫ్ ప్రతి పాదనలను పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం అన్నీ అంశాలపై క్షుణంగా పరిశీలించిన అనంతరం 8.14 కోట్ల నిధులు కేటాయించి పరిపాలన ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీచేసింది. అంచనాలతోచేసిన కొలతలు, లీడ్‌లు, డేటాలు, కేటాయింపులకు సంగారెడ్డి చీఫ్ ఇంజనీర్ బాధ్యత వహిస్తారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తాజాగా సింగూరు ప్రాజెక్టు మౌలిక వసతుల కల్పన చర్యల ద్వారా ప్రాజెక్టు సామర్థ్యం మరింతగా పెరగనున్నది. రైతుల సాగు, ప్రజల తాగునీటి అవసరాలను నీటి సరఫరరా సమర్థవంతంతా అందేలా మార్గం సుగమం కానున్నది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి సి దామోదర్ రాజనర్సింహా ప్రత్యేక చొరవ తీసుకుని రూ. 8.14 కోట్లు మంజూరు చేయించారు. ఇప్పటికే ప్రాజెక్టు




సింగూరు ప్రాజెక్టు దృశ్యం

ఇరువైపుల 6 కిలో మీటర్లు రివిట్‌మెంట్ పనులు, ప్రధాన ఎడమ కాలువ సిమెంటు లైనింగ్ పనులు ప్రారంభం అయ్యాయి. ఇటీవలనే ఆనకట్ట రివిట్ మెంట్ పునరుద్దరణ పనులతోపాటు ప్రధాన కాలువ సిమెంట్ లైనింగ్ పనులను మంత్రి దామోదర్ రాజనర్సింహా పరిశీలించారు. వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికల్లా ఆనకట్ట మరమ్మత్తు, సిమెంట్ లైనింగ్ పనులు పూర్తయ్యేలా వేగవంతం చేయాలని నీటి పారుదల శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ నిధులతో చేపట్టే పనులు నాణ్యతతో చేపడితే సింగూరు ప్రాజెక్టు పది కాలాల పాటు పదిలంగా ఉండనుంది.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం : ఎమ్మెల్యే

**నారాయణఖేడ్, మే 2 ప్రభాతవార్త :** ప్రభుత్వ పథకాలు ప్రజలకు పారదర్శకంగా అందేలా చూడాలని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి అన్నారు. శనివారం సాయి బాబా ఫంక్షన్‌హాల్ వేదికగా నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను గుర్తించి సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రగతి ప్రణాళికలను సిద్ధం చేయాలని, అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అన్ని శాఖల ప్రభుత్వ ఉన్నతాధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు,వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఇతర ప్రజా ప్రతినిధులు మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## పుల్‌కల్‌లో రైతు మంగిట్లో శాస్త్రవేత్తలు

**పుల్‌కల్, మే 2, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో శనివారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి శాస్త్రవేత్తలు డాక్టర్ కిరణ్‌రెడ్డి, డాక్టర్ చిరంజీవిలు పంటల సాగులో రైతులు పంటలో యూరియా, ఎరువులు, పురుగుమందుల వినియోగంలో పాటించాల్సిన పరిమిత పరిమాణం గురించి వివరించారు. పరిమిత పరిమాణంలో ఎరువులను వినియోగిస్తే సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చని, మట్టికి ఆరోగ్యం చేకూరుతుందన్నారు. పంటల మార్పిడితో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. పచ్చి ఎరువు, పంటల విత్తనాల లభ్యత, ట్రాన్స్ ఫ్లాంటింగ్ యంత్రాలకు సంబంధించి సబ్సీడీలపై రైతులు శాస్త్రవేత్తలను ప్రశ్నించగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విడుదల చేసిన కొత్త వరి రకాల విత్తనాలపై వివరించారు. డ్రిప్ ఎర్రిగేషన్, స్ప్రింక్లర్‌ల వాడకంతో నీటివృదా తగ్గుతుందని, పర్యావరణ రక్షణకు వృక్షా లను పెంచలని అవగాహన కల్పించారు. సరికొత్త పరిజ్ఞానం, సాంకేతికతలపై శాస్త్రవేత్తలు వివరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ప్రవీణ్, ఏఈఓ బాగేష్ పాల్గొన్నారు.

### వెంకటాపూర్ గ్రామంలో...

**సదాశివపేట, మే 2 (ప్రభాతవార్త):** మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో పీజేటీఏయూ శాస్త్రవేత్త షేక్ అహ్మద్ హుస్సేన్ పాల్గొని రైతులకు పలు వ్యవసాయ సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆయన యూరియా సరైన వినియోగం, పంటలకు అవసరమైన సిఫార్సు మోతాదుల వినియోగం, జీవ ఎరువుల తయారీ విధానాలు, సుస్థిర వ్యవసాయం కోసం పంటల వైవిధ్య ప్రాముఖ్యతపై రైతులకు వివరించారు. రైతులు ఆధునిక సాంకేతికతలను వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఒగ్గు శ్రీనివాస్, ఎంఏఓ జి. శ్రీనివాస్, ఏఈఓ గీత, డి. క్రిష్ణ, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఖలీల్, వార్డ్ సభ్యులు జనార్దన్, సురేష్, పెద్దలు శ్రీనివాస్ రెడ్డి, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు



వారాహి మాతకు పూజలు చేస్తున్న మాజీ మంత్రి హరీష్‌రావు

## ఘనంగా వారాహి మాత కుంభాభిషేక మహోత్సవం

**కొండపాక, మే 2, ప్రభాతవార్త :** కుకునూరుపల్లి మండల కేంద్రంలో వారాహి ప్రత్యంగిరా శరభేస్వార స్వామి విగ్రహ కుంభాభిసేక మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. శనివారం మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ వంటేరు యాదవరుద్దీ, బిఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గం ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు కురుమ కుల దైవమైన బీరప్ప అక్క మహం కాళి దేవాలయన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

## ఎల్లాయిగూడను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం : సర్పంచ్



ఎల్లాయగూడలో బాల వికాస సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

**కొండపాక, మే 2, ప్రభాతవార్త :** గ్రామాన్ని అదర్శ గ్రామంగా తీర్చిదిద్దడానికి కృషిచేస్తానని సర్పంచ్ సున్నం సుదర్శన్ అన్నారు. శనివారం కుకునూరుపల్లి మండల పరిధిలోని ఎల్లాయగూడ సర్పంచ్ అధ్యక్షత బాల వికాస అధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలవికాస సమావేశానికి ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేస్తామన్నారు. బాల వికాస అదర్శ గ్రామ నిర్మాణ పథకం మేనేజర్ మంజుల మాట్లాడుతూ బాల వికాస సంస్థ 40 సంవత్సరాలుగా తెలంగాణలోనే కాకుండా 8 పొరుగు రాష్ట్రాల్లో పలు అభివృద్ధి పథకాలను ప్రారంభించి కొనసాగిస్తూ లక్షలాది మందికి లబ్ధి చేకూరుస్తుందన్నారు. గ్రామంలో స్థిరమైన మార్పు కోసం నాయకులంత కలిసి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడి టీచర్లు, అశ వర్కర్లు, పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన ఆర్డీవో

**వెల్దుర్తి, మే 2, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన మాసాయిపేటలో శనివారం తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం సేకరణ, తేమశాతం, ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యాన్ని వేగవంతంగా రవాణా చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ దస్సింగ్, సర్వేర్ నరసింహులు, మాజీ పిఏసిఎస్ డైరెక్టర్ నర్సింలు, రైతులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తూప్రాన్ ఆర్డీవో జయ చంద్రారెడ్డి



పదవ తరగతి టాపర్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ తదితరులు

## పదో తరగతి టాపర్‌కు ఘన సన్మానం

**గుమ్మడిదల, మే 2 (ప్రభాతవార్త):** పదో తరగతి పరీక్షల్లో 565 మార్కులు సాధించి గుమ్మడిదల మండలంలో ప్రథమ స్థానంలో నిలిచిన తేజస్వినిని శనివారం మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్‌గౌడ్ విద్యార్థినిని ప్రత్యేకంగా ఆహ్వానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్యారెడ్డి, కౌన్సిలర్లు సారెడ్డి పద్మారెడ్డి, అభిశెట్టి రాజశేఖర్, గోకర్ నిర్మల, మేడిపల్లి మురళి, ఆర్ల కిషన్, బెంబడి సంజీవరెడ్డి, మద్ది సోనీ రెడ్డి, షేక్ గౌసియా, ఆకుల మాధవి, కత్తుల రమేష్, పొన్నాల ప్రమీల, సురభి కుమార్ గౌడ్, గిద్దె విజయలక్ష్మి, చూర్ణం చక్రపాణి, చప్పటి పద్మతో పాటు నాయకులు హుస్సేన్, శేఖర్ రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య రాకుండా ప్రత్యేక చర్యలు

### మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్‌గౌడ్

**గుమ్మడిదల, మే 2 (ప్రభాతవార్త):** ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్‌గౌడ్ తెలిపారు. వేసవి కాలంలో నీటి ఎద్దడి సమస్య రాకుండా ముందస్తు ప్రణాళికతో అధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ పనులు నిర్వహిస్తున్నామని చెప్పారు. మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో ఇటీవల ఏర్పాటు చేసిన బోరుబావులకు శనివారం బోర్ మోటార్లు అమర్చి నీటిసరఫరాను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ నీటి సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి ప్రాధాన్యత ఆధారంగా పరిష్కరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దశరథ్, వైస్‌చైర్మన్ చిమ్ముల సంధ్యారెడ్డి, కౌన్సిలర్లు సారెడ్డి పద్మరెడ్డి, అభిశెట్టి రాజశేఖర్, మేడిపల్లి మురళి, తుపాకుల రాధిక, ఆర్ల కిషన్, బెంబడి సంజీవరెడ్డి, మద్ది సోనీరెడ్డి, షేక్‌గౌసియా, ఆకుల మాధవి, కత్తుల రమేష్, పొన్నాల ప్రమీల, సురభికుమార్‌గౌడ్, గిద్దె విజయలక్ష్మి, శ్రీచూర్ణం చక్రపాణి, చప్పటి పద్మ తదితరులు పాల్గొన్నారు.

## నేడు భ్రమరాంబిక మల్లికార్జున స్వామి కళ్యాణం

**కొల్చారం, మే 2 (ప్రభాతవార్త):** మాధవానంద సరస్వతి స్వామి ఆశీర్వచనాలతో, పైతర గ్రామానికి చెందిన ఎల్లుగారి రాంకృష్ణారెడ్డి కుటుంబ సభ్యుల సహకారంతో రేపు ఉదయం 9గంటలకు భ్రమరాంబిక మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవంతోపాటు నూతన కళ్యాణ మండప ప్రారంభోత్సవం నిర్వహించనున్నట్లు సర్పంచ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు యాబన్నగారి రవితేజ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి పాత్రికేయ మిత్రులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

### టిజిఐఐసి చైర్మన్ నిర్మలజగ్గారెడ్డి

**సంగారెడ్డి బ్యూరో, మే 2 ప్రభాతవార్త:** అర్హులైన ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమని టీజీఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి పీఎస్ఆర్ గార్డెన్‌లో నియోజకవర్గస్థాయి సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మలజగ్గారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లో మహిళలకు మహాలక్ష్మి పేరుతో ఆర్టీసీలో ఉచిత ప్రయాణసౌకర్యాన్ని కల్పించిందన్నారు. ఇందిరమ్మ ఇల్లు, గృహజ్యోతి, రూ. 500 గ్యాస్ కనెక్షన్ వంటి సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని చెప్పారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులకు 195.18 కోట్ల విలువైన బ్యాంకు రుణాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిఆర్డివో జ్యోతి, ఆర్డిఓ రాజేందర్, సంగారెడ్డి, సదాశివపేట మున్సిపల్ చైర్మన్లు కూన వనిత, అంజమ్మ, కౌన్సిలర్‌లు, సీడీసీ చైర్మన్ రామ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రామచంద్రనాయక్, మున్సిపల్ కమిషనర్లు శ్రీనివాస్‌రెడ్డి, శివాజీ పాల్గొన్నారు.

## కొత్తపల్లిలో వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

**గుమ్మడిదల, మే 2 ప్రభాతవార్త :** గుమ్మడిదల మండలం కొత్తపల్లి గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని పటాన్‌చెరు నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను వినియోగించుకుని ధాన్యాన్ని నేరుగా విక్రయించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ పరమేశం, సర్పంచ్ సూరారం మంజుల, వార్డు నెంబర్లు, రైతులు,గ్రామ పెద్దలు, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వీరన్నగూడెంలో ఉచిత వైద్యశిబిరం

**గుమ్మడిదల, మే 2 (ప్రభాతవార్త):** గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని వీరన్నగూడెం గ్రామంలో శుక్రవారం ఉచిత రొమ్ము క్యాన్సర్ పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఏఐజి హాస్పిటల్, తెలంగాణ ప్రభుత్వం, గ్రాన్యూల్స్ కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ చిన్న పాపనికుమార్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్యా గోవర్ధన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ దశరథ్, స్థానిక కౌన్సిలర్ షేక్ గౌసియా హుస్సేన్ పాల్గొన్నారు. డాక్టర్ ఎస్. మధుకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 80 మంది మహిళలకు పూర్తిస్థాయిలో పరీక్షలు నిర్వహించారు. పరీక్షల నివేదికలను మూడు రోజులలో అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సురభి కుమార్‌గౌడ్, మురళి, చక్రపాణి, విజయలక్ష్మి, సర్‌రెడ్డి పద్మ, అభిశెట్టి రాజశేఖర్, తుపాకుల రాధిక, ఆర్ల కిషన్, మద్ది సోనీరెడ్డి, ఆకుల మాధవి, పొన్నాల ప్రమీలతో పాటు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. అలాగే సూపర్‌వైజర్ లక్ష్మీ, ఎంఎల్‌హెచ్‌పీ భాగ్యలక్ష్మి, ఏఎన్ఎంలు శశికళ, మణెమ్మ, హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. తదుపరి ఉచిత రొమ్ము క్యాన్సర్ పరీక్ష శిబిరాన్ని మే 8న గుమ్మడిదల ప్రైమరీస్కూల్‌లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## పైతర్ గ్రామంలో ఫంక్షన్ హాల్ ప్రారంభం

**కొల్చారం మే 2 ప్రభాతవార్త :** మండల పరిధిలోని పైతర గ్రామంలో యెల్లుగారి రామకృష్ణారెడ్డి సొంత నిధులతో నిర్మించిన "ఫంక్షనల్ గ్రామ" ఫంక్షన్ హాల్‌ను నేడు ఘనంగా ప్రారంభించారు. గ్రామ ప్రజలకు ఉపయోగపడే విధంగా ఆధునిక సౌకర్యాలతో ఈ ఫంక్షన్ హాల్‌ను నిర్మించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా యెల్లుగారి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో శుభకార్యాలు, వివాహాలు, సామాజిక కార్యక్రమాలు సౌకర్య వంతంగా నిర్వహించుకునేందుకు ఈ కళ్యాణ మండపాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతున్న కళ్యాణ కార్యక్రమాన్ని కూడా ఆయనే నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామాభివృద్ధికి ఎల్లప్పుడూ ముందుండే రామకృష్ణారెడ్డి సేవలను గ్రామ పెద్దలు, యువకులు అభినందించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, బంధు మిత్రులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## ఉప్పు లింగాపూర్‌లో ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళికలు.

**వెల్దుర్తి, మే 2, ప్రభాతవార్త :**

మండలంలోని ఉప్పులింగాపూర్, ఆరెగూడెం. వెల్దుర్తి, గ్రామాల్లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మదకద్రవ్యాలు, మానవ అక్రమ రవాణా, లింగ వివక్ష, లింగ సమానత్వం, స్త్రీద్వేషం. బాల్య వివాహాలు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జి రాజశేఖర్‌రెడ్డి హెచ్‌టియు, ఇన్‌స్పెక్టర్ కె.రామచందర్ ఎస్సై, బీసీలు చిట్టిబాబు, హెచ్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు

# సదాశివపేట పురపాలికలో కోఆప్షన్ సభ్యులు ఎన్నిక

**సదాశివపేట, మే 2 (ప్రభాతవార్త):** సదాశివపేట పురపాలికలో కోఆప్షన్ సభ్యుల ఎన్నిక ప్రక్రియ శనివారం ప్రశాంతంగా పూర్తైంది. మున్సిపల్ చైర్మన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించగా, టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మొత్తం కౌన్సిల్ సభ్యుల్లో 50 శాతం మంది హాజరైతే ఎన్నికల ప్రక్రియ నిర్వహించవచ్చని మున్సిపల్ కమిషనర్ శివాజీ సభ్యులకు వివరించారు. ఎక్స్ అఫీషియో సభ్యులతో కలిపి మొత్తం 27 మంది సభ్యులకుగాను 16 మంది హాజరుకావడంతో ఎన్నికల ప్రక్రియను ప్రారంభించారు. పురపాలన అనుభవం కలిగిన సాధారణ కోఆప్షన్ సభ్యుల విభాగంలో పురుషుల కోటా నుండి మునిపల్లి సత్యనారాయణ, మహిళల కోటా నుండి ఆగమామిడి అనంతమ్మ నామినేషన్లు దాఖలు చేశారు. కౌన్సిల్ సభ్యులు చేయి పైకెత్తి ఆమోదం తెలపడంతో వారిని ఎన్నికైనట్లు కమిషనర్ శివాజీ ప్రకటించారు. అలాగే మైనారిటీ విభాగంలో ఖాళీగాఉన్న రెండు కోఆప్షన్ సభ్యుల స్థానాలకు పురుషుల విభాగం నుండి ఇద్దరు, మహిళల విభాగం నుండి ఒకరు నామినేషన్లు దాఖలు చేశారు. అనంతరం మహమ్మద్ రహమత్, సీమ సుల్తానాను కౌన్సిల్ సభ్యులు ఆమోదించడంతో వారిని ఎన్నికైనట్లు కమిషనర్ ప్రకటించారు. ఈ




నియామక పత్రాన్ని స్వీకరిస్తున్న దృశ్యం

సమావేశానికి బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఇద్దరు సభ్యులు హాజరుకాగా, వారిలో ఒకరు మధ్యలోనే వెళ్లిపోయారు. మరోవైపు 24వ వార్డు కౌన్సిలర్ తాను కొత్తవాడినని, అయోమయంలో చేయి ఎత్తానని, కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు తెలిపినట్లు కాదని స్పష్టం చేశారు. అయితే దీనిని కాంగ్రెస్ నాయకులు తమకు బీఆర్ఎస్ సభ్యుడి మద్దతు లభించినట్లుగా ప్రకటించుకున్నారు. ఎన్నికైన కోఆప్షన్ సభ్యులను టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, మున్సిపల్ చైర్మన్ అంజమ్మ, కమిషనర్ శివాజీ పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ, పురపాలన అనుభవం కలిగిన మీరు ప్రజలకు మెరుగైన సేవలు అందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. తమ అభ్యర్థిత్వాన్ని సమర్థించి కోఆప్షన్ సభ్యులుగా అవకాశం కల్పించిన కాంగ్రెస్ పార్టీకి, ఎమ్మెల్యే జగ్గారెడ్డి, నిర్మలా జగ్గారెడ్డిలకు, సహకరించిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని ఎన్నికైన సభ్యులు తెలిపారు.